

రామకుప్పంలో ననియాల ఎకో టూరిజం పార్కు



చిత్తూరు-పలమనేరు రోడ్డు

మంచు కురిసె... మనసు మురిసె...









చిత్తూరు గంగినేని చెరువులో చలికి ముడుచుకున్న రామచిలుక -గంగినేని చెరువు కట్టను, చిత్తూరు ఓవర్‌బ్రిడ్జి రోడ్డును , రామకుప్పం-రాజుపేట క్రాస్ రహదారిని కమ్మేసిన పొగమంచు

సిసలైన శీతాకాలం కనిపిస్తోంది. చలిగుప్పెట్లో జనాన్ని బంధించి వణికిస్తోంది. లంబసింగి వాతావరణాన్ని తలపిస్తోంది. దీంతో వేకువజామున ఆహ్లాదం వెల్లివిరుస్తోంది. కొన్ని రోజులుగా దట్టమైన పొగమంచు అల్లుకుంటోంది. ప్రకృతికి ఇది అదనపు సోయగాలను అద్దుతోంది. తెల్లవారుజామున 4గంటల నుంచి ఉదయం 8గంటల వరకు ఈ పొగమంచు ప్రకృతి ప్రియులకు ఆనందాన్ని పంచుతోంది. తెల్లవారినా ఉదయభానుడి లేతకిరణాలు నేలతల్లిని తాకడం లేదు. దీంతో వాహనచోదకులు లైట్లు వేసుకుని రాకపోకలు సాగిస్తున్నారు. ఈ వాతావరణ ఫలితంగా ఇబ్బందులెదురైనా ఆస్వాదిస్తున్నామని ప్రజలు చెబుతున్నారు. రామకుప్పం మండలం ననియాల సమీపంలోని ఎకో టూరిజం పార్కుతో పాటు, పరిసర పొలాలు, అటవీ ప్రాంతాలు మంచు దుప్పట్లు కప్పుకొని నేత్రానందాన్ని అందిస్తున్నాయి. మరోపక్క సాయంత్రం చిరు చీకట్లు ముసురుకోగానే యధావిధిగా చలి విజృంభిస్తోంది.

- రామకుప్పం/చిత్తూరు (ఆంధ్రజ్యోతి)

ఆదివారం ప్రత్యేకం

'నగరం' నడుస్తోంది..!

ఉరుకుల, పరుగుల నగర జీవితంలో ఒత్తిడిని చిత్తు చేసే దివ్యౌషధం నడక అని ప్రజలు గ్రహిస్తున్నారు.ఆరోగ్యం కాపాడుకోవడంలో వాకింగ్ అవసరాన్ని గుర్తిస్తున్నారు. అందుకే రోజూ ఉదయం, సాయంత్ర వేళల్లో నడకబాట పడుతున్నారు.

7



వైభవంగా పుష్పయాగం



శ్రీవారి దేవేరి పద్మావతీ అమ్మవారి బ్రహ్మోత్సవాలు శుక్రవారంతో ముగిసిన నేపథ్యంలో శనివారం అమ్మవారికి పుష్పయాగం వైభవంగా జరిగింది. ఆలయంలోని శ్రీకృష్ణముఖ మండపంలో బంగారు తిరుచ్చిపై కొలువుదీర్చి 14 రకాల పుష్పాలు, పత్రాలతో అర్చకులు పుష్పయాగం నయనానందకరంగా నిర్వహించారు.

6

పండుగలా పేరెంట్స్ మీట్

- క్రీడాపోటీలు,సహపంక్తి భోజనాలతో స్కూళ్లలో ఉత్సాహభరిత వాతావరణం
- విద్యార్థుల సామర్థ్యాల పరిశీలన ● ప్రోగ్రెస్ , హెల్త్ కార్డుల అందజేత



బంగారుపాళ్యంలో పిల్లలతో కలెక్టర్, ఎమ్మెల్యే సహపంక్తి భోజనాలు

జిల్లావ్యాప్తంగా శనివారం ప్రభుత్వ,ఎయిడెడ్ పాఠశాలల్లో తల్లిదండ్రులు-ఉపాధ్యాయుల సమావేశాలు పండుగ వాతావరణంలో జరిగాయి. గతానికి భిన్నంగా తల్లిదండ్రులు పెద్దఎత్తున హాజరవగా వారికి ఉపాధ్యాయులు ప్రత్యేక ఆటల పోటీలు నిర్వహించారు. మహిళలకు ముగ్గుల పోటీలు, మ్యూజికల్ చైర్స్ వంటివి, మగవారికి టగ్ ఆఫ్ వార్ వంటి పోటీలు జరిపి గెలిచిన వారికి బహుమతులు అందజేశారు. గతేడాది టెన్త్ ఫలితాల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందించారు. పిల్లలకు సంబంధించి సమగ్ర వివరాలతో ప్రోగ్రెస్ రిపోర్టులను, హెల్త్ కార్డులను తల్లిదండ్రులకు అందజేశారు.ఆపై అంతా కలసి సహపంక్తి భోజనాలు చేశారు.ప్రజాప్రతినిధులు, అధికారుల రాకతో స్కూళ్లకు అదనపు కళ వచ్చినట్టయింది.

చిత్తూరు సెంట్రల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి):స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్‌ఎంసీ)ల ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా పేరెంట్స్‌డేలో ప్రజా ప్రతినిధులు కూడా పాల్గొన్నారు. విద్యార్థుల పురోగతిపై క్లాస్ టీచర్లు తల్లిదండ్రులతో చర్చించారు.వారిలో కొందరితో అతిధి ప్రసంగాలు చేయించారు.పిల్లల చదువుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతామని హెచ్ఎంలు ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలు మెరుపర్చడంలో భాగంగా మెగా పేరెంట్స్ డే నిర్వహించడం జరిగిందని కలెక్టర్ సుమిత్ కుమార్ చెప్పారు. బంగారుపాళ్యంలో ఎమ్మెల్యే మురళీమోహన్‌తో కలిసి పేరెంట్స్ మీటింగులో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు సయోధ్యతో మెలగడం ద్వారా విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దడంలో భాగస్వాములు కాగలరన్నారు.ఈ కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యేలు, వివిధ శాఖల ఉన్నతాధికారులు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో ఎదిగేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చొరవ చూపాలన్నారు.పిల్లల విద్యాభ్యాసంపై తల్లిదండ్రులు దృష్టి సారించి, లోటుపాట్లను ఉపాధ్యాయులకు తెలియజేయాలని సూచించారు.



విద్యార్థి తండ్రితో మాట్లాడుతున్న జేసీ విద్యాధరి

● ఎవరెవరు.. ఎక్కడెక్కడ?

కలెక్టర్ సుమిత్ కుమార్, పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ పి.కొత్తకోట,బంగారుపాళ్యం మండలాల్లోని జడ్పీ ఉన్నత పాఠశాలల్లో జరిగిన సమావేశాల్లో పాల్గొన్నారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో సహపంక్తి భోజనం చేశారు.కుప్పం బాలుర ఉన్నత పాఠశాల, గుడుపల్లి ఏపీ మోడల్ స్కూల్‌లో ఎమ్మెల్సీ శ్రీకాంత్, ఎస్‌ఆర్‌పురం ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే థామస్, చిత్తూరు గిరింపేట మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో జేసీ విద్యాధరి, గుడిపాల మండలం కమ్మతిమ్మపల్లి జడ్పీహెచ్‌ఎస్‌లో ఎమ్మెల్యే జగన్మోహన్, చుడా చైర్‌పర్సన్ కటారి హేమలత, నగరి మున్సిపల్ ఉన్నత పాఠశాల, ఏకాంబరకుప్పం జడ్పీహెచ్‌ఎస్‌లో ఎమ్మెల్యే భానుప్రకాష్, పెద్దపంజాణి మండలం రాయలపేట జెడ్పీహెచ్‌ఎస్‌లో ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి, కుప్పం మండలం దాసేగానూరు జడ్పీహెచ్‌ఎస్‌లో ఆర్టీసీ వైస్ చైర్మన్ మునిరత్నం పాల్గొన్నారు.అధికారుల విషయానికి వస్తే డీఈవో వరలక్ష్మి, సమగ్రశిక్ష ఏపీసీ వెంకటరమణారెడ్డి,డీఆర్డీఏ పీడీ శ్రీదేవి, డీపీవో సుధాకర రావు,డ్వామా పీడీ రవికుమార్,హౌసింగ్ పీడీ పద్మనాభం, డీఎస్వో శంకరన్,ఐసీడీఎస్ పీడీ హైమావతి, పశుసంవర్ధక శాఖ జేడీ ప్రభాకర్ తదితరులతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



యాదమరి హైస్కూల్లో టగ్ ఆఫ్ వార్ పోటీలు



హెల్త్ కార్డును అందజేస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

డ్రగ్స్ వద్దు బ్రో..: ఏఎస్పీ రాజశేఖరరాజు

చిత్తూరు అర్బన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలకు దూరంగా ఉండి, ఉజ్వల భవిష్యత్తును కాపాడుకోవాలని విద్యార్థులకు ఏఎస్పీ రాజశేఖరరాజు సూచించారు. శనివారం చిత్తూరులోని సంతపేట విజయలక్ష్మీకాలనీలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశంలో డ్రగ్స్ వాడకంతో కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. పాఠశాలల్లోనే కాకుండా విద్యార్థులు నివసించే ప్రాంతాల్లో ఎవరైనా డ్రగ్స్ వాడకం, అమ్మకం చేస్తే 112 లేదా 94409 00005 నెంబరుకు సమాచారం ఇవ్వాలని కోరారు. డీఎస్పీ సాయినాథ్, రెండో పట్టణ సీఐ నెట్టికంఠయ్య, ట్రాఫిక్ సీఐ నిత్యబాబు, సిబ్బంది పాల్గొన్నారు. కాగా శనివారం జిల్లా వ్యాప్తంగా జరిగిన మెగా పేరెంట్స్, టీచర్స్ డే కార్యక్రమంలో సీఐలు, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొని డ్రగ్స్ వాడకంపై తల్లిదండ్రులు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. అలాగే సైబర్ క్రైమ్, మహిళా భద్రత, ట్రాఫిక్ నిబంధనలనూ తెలియజేశారు.

నేడు డీఆర్సీ సమావేశం

హాజరు కానున్న ఇన్‌చార్జి మంత్రి

చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి సమీక్షా సమావేశం (డీఆర్సీ) ఆదివారం ఉదయం 10 గంటలకు స్థానిక జిల్లా పరిషత్ మీటింగ్ హాలులో జరుగుతుందని కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. సమావేశానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర రవాణాశాఖ మంత్రి ఎం. రామ్‌ప్రసాద్ రెడ్డి అధ్యక్షత వహిస్తారన్నారు. సమావేశంలో ఎంపీలు, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు, జడ్పీ చైర్మన్, ప్రజా ప్రతినిధులు పాల్గొంటారని వివరించారు.

ఇన్‌చార్జి ఎస్పీగా సుబ్బరాయుడు



చిత్తూరు అర్బన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎస్పీ మణికంఠ శనివారం నుంచి ఐదు రోజుల వరకు వ్యక్తిగత సెలవులపై వెళ్లారు. దీంతో ఇన్‌చార్జి ఎస్పీగా తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడిని నియమిస్తూ శనివారం అనంతపురం డీఐజీ ఉత్తర్వులు జారీ చేశారు.

మురిక్కాలువల నిర్మాణానికి రూ.110.21 కోట్ల మంజూరు

కుప్పం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కుప్పం నియోజకవర్గవ్యాప్తంగా మురుగు కాలువల నిర్మాణానికి రూ.110.21 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య శాఖ చీఫ్ ఇంజినీరు పంపిన ప్రతిపాదనలను ఆమోదించింది. 451 పనులకు సాంకేతిక అనుమతులు మంజూరు చేస్తూ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ శశి భూషణ్ కుమార్ గురువారం ఉత్తర్వులు విడుదల చేశారు.

మమ.. అనిపించారు!

- మూడు గంటల్లోనే ముగిసిన జడ్పీ స్థాయీ సంఘాల సమావేశాలు
- స్టాండింగ్ కమిటీ సమావేశంలో బయటి వ్యక్తులు



సమావేశంలో ప్రసంగిస్తున్న జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

చిత్తూరు రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ స్టాండింగ్ కమిటీ సమావేశం తూతూ మంత్రంగా నిర్వహించారు. కచ్చితంగా సమావేశం నిర్వహించాలన్నట్టుగా కొంతమంది జడ్పీటీసీలతో సమావేశాన్ని ముగించారు. జడ్పీ చైర్మన్ చాంబర్‌లో 1, 2, 4, 7 స్థాయీ సంఘాల సమావేశం చైర్మన్ శ్రీనివాసులు అధ్యక్షతన సీఈవో రవికుమార్ నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. 3, 5, 6 సంఘాల సమావేశాలను జడ్పీ సీఈవో చాంబర్‌లో డిప్యూటీ సీఈవో జుబేద ఆధ్వర్యంలో నిర్వహించారు. ఏదో సభ్యులు వారి కష్టాలు చెప్పుకునేందుకు ఈ సమావేశాలు జరిగినట్లు తెలుస్తోంది. తమకు పనులు కావడం లేదని అధికారులపై చాడీలు తప్ప. ప్రజల సమస్యలపై ఫోకస్ పెట్టలేదన్నట్లుగా కనిపించింది. అలాగే సమావేశం నిర్వహణలోనూ లోపాలు కనపడ్డాయి. సమావేశాలను సంఘాల వారీగా నిర్వహించాల్సింది పోయి అదే సభ్యులతో అన్ని సమావేశాలు నిర్వహించారు. మొదట స్థాయీ సంఘ సమావేశం నుంచి చివరి వరకు అదే సభ్యులతో సమావేశాలను పూర్తి చేశారు. దీన్ని జడ్పీ అధికారులు కూడా పెద్దగా పట్టించుకోలేదు. వారు కూడా జరిగిపోనీలే అన్నట్లుగా మిన్నకుండిపోయారు. ఉదయం జరగాల్సిన సమావేశాన్ని పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ కారణంగా మధ్యాహ్నంపైన నిర్వహించారు. మధ్యాహ్నం రెండు గంటలకు మొదలుపెట్టి.. ఐదు గంటలకు అన్ని స్థాయీ సంఘాల సమావేశాలను ముగించేశారు. కాగా, ఈ సమావేశాల్లో జడ్పీటీసీ సభ్యులు కానీ వారు కూడా పాల్గొనడం విమర్శలకు తావిస్తోంది. కొంత మంది సభ్యుల బంధువులు ఈ సమావేశాలకు హాజరయ్యారు. వైస్ చైర్‌పర్సన్ రమ్య, స్త్రీ, శిశు సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్ భారతి పాల్గొన్నారు.

కళ్లలో కారం కొట్టి...బండరాయితో బాది

ప్రియుడితో కలిసి భర్తను హతమార్చిన మహిళ



గోవిందప్ప

శాంతిపురం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ప్రియుడితో కలిసి భర్తను భార్య హతమార్చిందో భార్య. రాళ్ళబూదుగూరు ఎస్ఐ నరేష్ కథనం ప్రకారం..శాంతిపురం మండలం సోలిశెట్టిపల్లెకు చెందిన మీనా ఈ నెల 4 నుంచి భర్త గోవిందప్ప కనబడడం లేదని 5న పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు.మీనాపై అనుమానమొచ్చి కాల్‌డేటా పరిశీలించారు. వెంటనే ఆనంద్, మీనాలను అదుపులోకి తీసుకుని విచారించడంతో అసలు విషయం బయటపడింది. మీనాకు రాళ్ళబూదుగూరుకు చెందిన ఆనంద్‌తో వివాహేతర సంబంధం ఉంది. విషయం తెలిసిన గోవిందప్ప భార్యను మందలించాడు. పద్ధతి మార్చుకోకపోవడంతో తీవ్ర స్థాయిలో హెచ్చరించాడు. ఈ నేపథ్యంలో భర్తను హతమార్చాలని ప్రియుడితో కలిసి మీనా పన్నాగం పన్నింది. అందులో భాగంగా ఈ నెల 4న సోలిశెట్టిపల్లె సమీపంలోని పొలం వద్దకు భర్త గోవిందప్పను పిలిపించింది. అతని కళ్ళల్లోకి కారం పొడి చల్లింది. ప్రియుడు ఆనంద్,ఆమె కలిసి అతడిని బండరాయితో కొట్టి చంపారు. ఎవరికీ తెలియకుండా ఆనంద్ స్నేహితుడు మునిరాజు సహాయంతో గోవిందప్ప మృతదేహాన్ని గుడుపల్లె మండలం బిసానతం సమీపంలోని కర్ణాటక రాష్ట్ర సరిహద్దులోని ఫారెస్ట్‌లో పడేశారు. శనివారం కుప్పం రూరల్ సీఐ మల్లేష్‌యాదవ్, రాళ్ళబూదుగూరు ఎస్ఐ నరేష్, సిబ్బందితో కలిసి నిందితులు మీనా, ఆనంద్, మునిరాజులను ఆ ప్రదేశానికి తీసుకొని వెళ్లారు. అక్కడ మృతదేహాన్ని గుర్తించారు. మీనా, ఆనంద్‌లతో పాటు మునిరాజులను అరెస్టు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ నరేష్ తెలిపారు.

ఫ్రిజ్ పేలి వృద్ధుడి మృతి



తీవ్ర గాయాలతో సీతారామయ్య

తవణంపల్లె, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో రిఫ్రిజిరేటర్ పేలి ఓ వృద్ధుడు మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. తవణంపల్లె మండలం దిగువమాఘానికి చెందిన సీతారామయ్య(69) శనివారం ఉదయం ఆరు గంటలకు వేడి నీళ్ల కాచుకోవడానికి స్టౌవద్దకు వెళుతున్నాడు. ఈ సమయంలో ఇంట్లోని రిఫ్రిజిరేటర్‌లో షార్ట్ సర్క్యూట్ జరిగి పేలిపోయింది. దీనివల్ల అందులోని గ్యాస్ లీకై ఇంట్లో మొత్తం మంటలు వ్యాపించాయి. ఆ మంటలు సీతారామయ్యకు అంటుకుని, శరీరం పూర్తిగా కాలిపోయింది. ఇంట్లోని వస్తువులూ ధ్వంసం అయ్యాయి. స్థానికులు గమనించి.. ఫైరింజిన్‌కు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. బాధితుడిని చిత్తూరు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. తవణంపల్లె పోలీసులు కేసు నమోదు చేసి.. మృతదేహాన్ని శవ పరీక్షకు తరలించారు. కాగా, సీతారామయ్య భార్య భానుమతి ఇంటి బయట ఉన్న బాత్‌రూమ్‌కు వెళ్లడంతో ఆమె ప్రమాదం నుంచి బయట పడినట్లు గ్రామస్తులు తెలిపారు.





విరులు విరిసె.. తనువు మురిసె!

వైభవంగా పద్మావతిదేవికి పుష్పార్చన

తిరుచానూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి దేవేరి పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవ శోభ వెల్లివిరిసింది. అమ్మవారికి శనివారం పుష్పయాగాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొల్పి నిత్య కైంకర్యాలు నిర్వహించారు. ఉదయం 9 గంటలకు ఉత్సవమూర్తిని శ్రీకృష్ణ ముఖమండపంలో కొలువుదీర్చారు. కుంభ మండల ఆరాధన, అగ్ని ప్రతిష్ఠ యాగశాలలో హోమం నిర్వహించారు. అనంతరం నేత్రపర్వంగా స్నపన తిరుమంజనం చేశారు. మధ్యాహ్నం మూడు గంటలకు ఆలయంలో ప్రాయశ్చిత హోమం, శాంతి హోమం, పూర్ణాహుతి జరిగింది. సాయంత్రం ఐదు గంటలకు అమ్మవారి ఉత్సవమూర్తిని శ్రీకృష్ణముఖ మండపంలో బంగారు తిరుచ్చిపై కొలువుదీర్చి 14రకాల పుష్పాలు, పత్రాలతో పుష్పయాగం నయనానందకరంగా నిర్వహించారు.





ఎకరాకు రూ.2లక్షల ఆదాయం

విత్తనాలు నాటిన తర్వాత 30 రోజులకు వంగనారు సిద్ధమవుతుంది. దీనిని పొలంలో నాటుకోవాలి. 50 రోజులకు దిగుబడి మొదలవుతుంది. ఎకరాకు 70 నుంచి 80 వేలు ఖర్చవుతుంది. ఆరు నుంచి ఎనిమిది నెలల దాకా కాపు ఉంటుంది. మార్కెట్‌లో రేటు బావుంటే ఎకరాకు రెండు లక్షల దాకా ఆదాయం వస్తుంది.

తింటే.. తాళ్వాయిపాడు వంకాయ తినాలి



● దేశవిదేశాల్లో డిమాండ్ ● వందల ఎకరాల్లో సాగు

కథనం పెళ్లకూరు,ఆంధ్రజ్యోతి

'వంకాయ వంటి కూరయు.. పంకజముఖి సీతవంటి భామామణియున్..' అని ఒక పద్యం ప్రచారంలో ఉంది. కూరగాయలన్నింటిలో వంకాయకున్న ప్రత్యేకత అది. 'వంకాయతో వెయ్యిరకాలు' అని కూడా అంటారు. అంటే.. వెయ్యి రకాల వంటలు చేయదగిన కూరగాయ- వంకాయ అని. కాస్త అతిశయోక్తి ఉంటే ఉండవచ్చునుగానీ తెలుగునేల మీద వంకాయకు ఉన్న ప్రాధాన్యం అటువంటిది. పొడుగూ, పొట్టి, తెల్ల, పచ్చ.. అంటూ వంకాయల్లో ఎన్నిరకాలున్నా.. చారలున్న తాళ్వాయిపాడు వంకాయ రుచికి ఏదీ దీటు రాదు. ఎలా వండినా కమ్మగా కరిగిపోయే ఈ వంకాయలకు అందుకే అంత డిమాండ్ ఉంది. తిరుపతి జిల్లా పెళ్లకూరు మండలంలో శ్రీకాళహస్తి- నాయుడుపేట జాతీయరహదారి మీద ఉండే ఊరే తాళ్వాయిపాడు.



ముదురాకుపచ్చ చారలున్న లేతపచ్చ వంకాయలకు ప్రసిద్ధి తాళ్వాయిపాడు. ఈ గ్రామంలో వంద ఎకరాల్లో వంకాయ సాగు ఉండేది. జాతీయ రహదారి విస్తరణ, కొత్తగా వెలిసిన పరిశ్రమలకు భూములు పోవడం, ఉన్న భూములకు రియల్ ఎస్టేట్ విలువ పెరిగి బంగారంగా మారిపోవడంతో వంగసాగు 40 ఎకరాలకు తగ్గిపోయింది. ఊళ్లో సాగు తగ్గినా తాళ్వాయిపాడు వంకాయ సాగు అనేక సమీప గ్రామాలకు విస్తరించింది. తాళ్వాయిపాడులోని నర్సరీ నుంచి నారు తీసుకువెళ్లి వంగసాగు చేస్తున్నారు. చావలి, చెంబడిపాలెం, పెన్నేపల్లి, కానూరు, రోసనూరు, శిరసనంబేడు, నందిమాల, కానూరుబంగారం పేట, మోదుగులపాళెం, కప్పగుంట కండ్రిగ, చెన్నప్ప నాయుడుపేట, సూళ్లూరుపేట సమీపంలోని మన్నారుపోలూరు, ఆబాక, అగ్రహారం, గూడూరు సమీపంలోని ఇందూరు చెంబడిపాళెం, వెందోడుల్లో దాదాపు 500 ఎకరాల్లో తాళ్వాయిపాడు వంకాయ సాగు చేస్తున్నారు. ఈ విత్తనాలు మార్కెట్‌లో లభించవు. రైతులే తమ పంటనుంచి సేకరించి నారుపోసుకుంటారు. ఈ వంగకున్న డిమాండ్‌ను గ్రహించిన తాళ్వాయిపాడు రైతు కట్టా బాల సుబ్రహ్మణ్యం నర్సరీలో పెద్ద ఎత్తున వంగ నారు పెంచి అమ్ముతున్నారు. బెంగళూరు, హోసూరు ప్రాంత రైతులు కూడా ఇక్కడి నుంచి వంగ నారు తీసుకువెళ్తున్నారు.



నేదురుమల్లికి ప్రియమైన వంకాయ

ఉమ్మడి ఏపీ ఒకనాటి ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి తరచూ తాళ్వాయిపాడు నుంచి హైదరాబాదుకు వంకాయలను తెప్పించుకునేవారు. ఢిల్లీ నుంచి వచ్చే నాయకులకు వీటితో వంటకాలు చేయించే పెట్టేవారు. ఆయన ఇచ్చే విందుల్లో తాళ్వాయిపాడు వంకాయలతో చేసిన కూరలను అతిథులు ఇష్టంగా తినేవారని చెబుతారు. ఆయన రాజ్యసభ సభ్యుడిగా ఉన్న కాలంలో తాళ్వాయిపాడు నుంచి వంగనారు విమానంలో తెప్పించుకుని తన పెరటిలో వేయడంతో పాటూ, ఢిల్లీలోని కొందరు నాయకులకూ ఇచ్చారు. తాళ్వాయిపాడు వంకాయ రుచి ఎరిగిన ఈప్రాంతవాసులు తమ స్నేహితులకు తరచూ ఈ వంకాయలను పంపుతుంటారంటే అతిశయోక్తి కాదు.

స్వర్ణముఖి నీటి మహిమ

స్వాతంత్ర్యానికి పూర్వం నుంచీ తాళ్వాయిపాడులో వంగసాగు జరుగుతున్నట్టు చెబుతున్నారు. తాళ్వాయిపాడు వంకాయకు ఇంత కమ్మటి రుచికి కారణం స్వర్ణముఖి నదీతీరపు నేలలో పెరగడమేనని ఇక్కడి రైతులు చెబుతారు. ఇదే వంకాయ ఇతర ప్రాంతాల్లో పండినా, వాటికీ, ఈ ఊరిలో పండిన వంకాయకూ రుచిలో తేడా ఉంటుందంటారు. అందుకే ఢిల్లీ, బెంగళూరు, చెన్నైలకు తాళ్వాయిపాడు వంకాయలు పంపుతుంటారు. ప్రముఖులు తమ బంధు మిత్రులకు కానుకగా తాళ్వాయిపాడు వంకాయలు పంపుతుండడాన్ని బట్టి దీని ప్రత్యేకను గ్రహించవచ్చు. బెంగళూరు, చెన్నై, తిరుపతి, నెల్లూరు బస్సుల్లో తాళ్వాయిపాడు వంకాయలు పంపేవారు. బస్తాలపై టీవీఎస్(తాళ్వాయిపాడు వంకాయల సర్వీస్) అని రాసేవారు. రవాణాలో సిబ్బంది, కూలీలు ఈ అక్షరాలున్న మూటలను ఎలా అంటే అలా పడేసేవారు కాదు.



వంగకు డిమాండ్ ఎక్కువ

నాకున్న ఒకటిన్నర ఎకరా నేలలో 50 సెంట్లు వంగ సాగు చేస్తున్నా. మిగిలిన నేలలో ఆకు కూరలు, చిక్కుడు, బెండ వేశాను. అయితే వంగకున్న డిమాండ్ ఎప్పుడూ మిగిలిన వాటికి ఉండదు.

- మనుబోలు కార్తిక్, తాళ్వాయిపాడు.

సేంద్రియమే ఎక్కువ

రెండు ఎకరాల విస్తీర్ణంలో వంగనారు పెంచుతాను. మంచి డిమాండ్ ఉంది. నారుకీ, సాగుకీ కూడా 80శాతం సేంద్రియ పద్ధతినే అనుసరిస్తాం. వేప కషాయం, పేడ ఎరువులనే నేలలో కలియదున్ని నారు నాటుకుంటాం. ఈ పద్ధతి వల్ల చీడపీడలు తక్కువగానే ఆశిస్తాయి. అప్పటికీ పురుగు ఆశిస్తే ఇక తప్పనిసరి పరిస్థితుల్లో రసాయన మందులు పిచికారీ చేస్తుంటాం.

-కట్టా బాలసుబ్రహ్మణ్యం, నర్సరీ యజమాని, తాళ్వాయిపాడు.



మా కుటుంబానికి ఆసరా

ఎన్నో ఏళ్లుగా మేం వంగ సాగు చేస్తున్నాం. లాభదాయకమైన పంట ఇది. ఉద్యానశాఖ అధికారుల సూచనలు కూడా తీసుకుంటూ ఉంటాం. కోతలు మొదలయ్యాక రోజు మార్చి రోజు మార్కెట్‌కి కాయలు పంపుతాం. మా కుటుంబానికి పెద్ద ఆసరా వంగసాగు.

- హరిప్రియ, వంగరైతు



ఈ నంబర్ల నుంచి ఫోన్లు వస్తే లిఫ్ట్ చేయొద్దు

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వ్యక్తులు, ఇంటర్నేషనల్ కాల్స్ వస్తే వెంటనే లిఫ్ట్ చేయకూడదని జిల్లా సైబర్ క్రైం పోలీసులు హెచ్చరించారు. ఏమరపాటుగా ఉంటే బ్యాంకు అకౌంట్లలో ఉండే డబ్బు కాజేస్తారని చెబుతున్నారు. తరచూ ప్లస్ 381 (సెర్బియా), ప్లస్ 255(టాంజానియా), ప్లస్ 563(లోవా) ప్లస్ 375(బెలారస్) వంటి కోడ్ నెంబర్లతో ఫోన్ రింగ్ అవుతుందని, వీటితో పాటు 94777455913, ప్లస్ 255901130460, ప్లస్ 56322553736, ప్లస్ 37052529259 తదితర నెంబర్ల నుంచి ఫోన్లు వస్తే లిఫ్ట్ చేయవద్దని సూచించారు. లిఫ్ట్ చేస్తే కేవలం మూడు సెకన్లలో ఫోన్‌లోని విలువైన సమాచారాన్ని కాజేసే అవకాశముందని వివరించారు. కాగా, అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి, హ్యాష్ 90 లేకుంటే హ్యాష్ 09 నెంబర్లను ప్రెస్ చేయాలని కోరుతున్నారని, దాన్ని అంగీకరించవద్దని సూచించారు. పొరబాటున ఈ కోడ్‌లు ఎంటర్ చేస్తే యూజర్ సిమ్ కార్డు యాక్సెస్ కేటుగాళ్ల చేతికి వెళ్లే అవకాశముందని సైబర్ క్రైం సీఐ వినోద్ తెలిపారు.

సైబర్ వలలో ఆర్టీసీ ఉద్యోగి

● రూ.1.18 లక్షలు పోగొట్టుకున్న వైనం

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ పరిధిలోని ఆర్టీసీ ఉద్యోగి సైబర్ వలకు చిక్కాడు. వారి మాటలకు మోసపోయి తనతో పాటు కుమార్తె అకౌంటులోని రూ.1.18లక్షలు పోగొట్టుకున్నాడు. రూరల్ సీఐ చిన్నగోవిందు తెలిపిన వివరాల మేరకు.. తిరుపతి రూరల్ మండలం ధనలక్ష్మీనగర్‌కు చెందిన సురేంద్రనాథరెడ్డి తిరుపతి ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్నాడు. గతనెల 26వ తేదీన టీవీ డిష్ యాక్టివేషన్ చేయడానికి ప్రయత్నించాడు. ఆన్‌లైన్ ద్వారా కస్టమర్ కేర్ నంబరుకు ఫోన్ చేశాడు. ఆ సమయంలో సైబర్ క్రైం మోసగాళ్లు వాట్సాప్ ద్వారా రస్ట్ డస్క్ రిమోట్ యాక్సెస్ యాప్‌ను ఫోన్ ద్వారా డౌన్‌లోడ్ చేయించారు. దీంతో సురేంద్రనాథరెడ్డి మొబైల్ ఫోన్ నంబరును మెల్లగా యాక్సెస్‌లోకి తీసుకున్నారు. అకౌంట్‌లో బ్యాలెన్సు చెక్ చేయమని చెప్పారు. బ్యాలెన్సు చూడగా కుమార్తె అకౌంటులో ఉన్న రూ.28,001లు, సురేంద్రనాథరెడ్డి అకౌంటులో ఉన్న రూ.90,300 మొత్తం రూ.1.18లక్షలు మాయమైపోయాయి. దీనిపై శనివారం తిరుపతి రూరల్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ చిన్నగోవిందు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 27 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు.. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు. ఇక, గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శుక్రవారం లెక్కించింది. రూ.2.97కోట్లు ఆదాయం లభించినట్టు శనివారం ఉదయం ప్రకటించింది.శుక్రవారం 75,782 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా,26,057మంది తలనీలాలు సమర్పించారు.

ఫిబ్రవరిలో 'ఉప్పు కప్పురంబు' విడుదల

● హీరో సుహాస్



తిరుమల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కీర్తి సురేష్‌తో 'ఉప్పు కప్పురంబు' అనే చిత్రం షూటింగ్ జరుగుతోందని, ఫిబ్రవరిలో ఈ చిత్రం విడుదల కానుందని హీరో సుహాస్ తెలిపారు. తిరుమల శ్రీవారిని శనివారం ఉదయం దర్శించుకున్న సుహాస్ ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. తన 'కలర్ ఫొటో' చిత్ర దర్శకుడు సందీప్ వివాహం కోసం తిరుమలకు వచ్చి స్వామి ఆశీస్సులు పొందినట్టు తెలిపారు. చాలా రోజుల తర్వాత మంచి దర్శనం లభించిందని సంతోషం వ్యక్తం చేశారు. కాగా, ఆలయం ముందు సుహాస్‌ను చూసేందుకు అభిమానులు ఉత్సాహం చూపారు. ఆయనతో కలిసి సెల్ఫీలు తీసుకునేందుకు ఎగబడ్డారు.

అడవి జంతువుల కోసం విద్యుత్ తీగలు

మూడు గేదెలు, ఒక ఆవు మృతి

పెళ్లకూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): అడవి జంతువుల కోసం తీసిన విద్యుత్ తీగలు తగిలి మూడు గేదెలు, ఒక ఆవు మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుల కథనం మేరకు... రోసనూరు రాజుపాలెం అరుందతి కాలనీకి చెందిన రవి తన రెండు గేదెలు, ఒక ఆవును గురువారం ఉదయం మేత కోసం అడవిలోకి తోలుకెళ్లి వదిలాడు. చీకటి పడ్డాక కూడా గేదెలు, ఆవు రాకపోవడంతో మరసటి రోజు వస్తాయని భావించాడు. శుక్రవారం సాయంత్రం పశువులను తోలుకురావడానికి అడవికి వెళ్లగా ఎక్కడా కనిపించలేదు. గాలించగా సమీపంలోని మామిడి తోటలో మృతి చెంది కనిపించాయి. అక్కడి పరిసరాలను పరిశీలించగా అడవి జంతువుల వేట కోసం తీసిన విద్యుత్ తీగలు కనిపించాయి. పశువులకు విద్యుత్ తీగలు తగిలి కాలిన గాయాలు ఉండడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. శనివారం ఉదయం ఎస్ఐ నాగరాజు సంఘటనా స్థలానికి చేరుకుని మామిడి తోటను పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు. కాగా, మామిడి తోట యజమాని చెన్నైలో నివాసం ఉండడంతో స్థానికులు ఎవరో అడవి జంతువుల వేట కోసం విద్యుత్ తీగలు ఏర్పాటు చేసి ఉంటారని అనుమానిస్తున్నారు.



రెచ్చిపోయిన తాగుబోతులు

● మద్యం మత్తులో ప్రైవేటు ఇంజనీర్‌పై దాడి

● ముక్కంటి ఆలయ ఉద్యోగికి దేహశుద్ధి

శ్రీకాళహస్తి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ముక్కంటి ఆలయ ఒప్పంద ఉద్యోగి ఒకరు కొందరు తాగుబోతు మిత్రులతో కలిసి రెచ్చిపోయాడు. అకారణంగా రోడ్డు పక్కన నిలబడి ఉన్న ఓ ప్రైవేటు ఇంజనీర్‌పై దాడి చేశాడు. ఈ ఘటనను చూసిన కొందరు స్థానికులు ఆలయ ఉద్యోగిని చితకబాదారు. శ్రీకాళహస్తికి చెందిన వినోద్ చౌదరి అనే యువకుడు రేణిగుంటలోని ఓ ప్రైవేటు కర్మాగారంలో ఇంజనీర్‌గా పనిచేస్తుంటాడు. శుక్రవారం రాత్రి శ్రీకాళహస్తిలోని శ్రీరామ్‌నగర్‌కాలనీ తిరుపతి ప్రధాన రహదారి పక్కన ఉన్న తన అత్తగారి ఇంటి వద్దకు వెళ్లాడు. అక్కడ నిలుచుని భార్యతో మాట్లాడుతూ ఉన్నాడు. కడప ప్రాంతానికి చెందిన భాస్కర్‌రెడ్డి శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఒప్పందఉద్యోగిగా పనిచేస్తుంటాడు. ప్రస్తుతం ఆయన భక్తకన్నప్ప సదన్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. శుక్రవారం రాత్రి శ్రీకాళహస్తికి చెందిన ముగ్గురితో పాటు ఊరందూరు గ్రామానికి చెందిన మరో వ్యక్తితో కలిసి ఫూటుగా మద్యం సేవించాడు. ఈ నలుగురు శ్రీరామ్‌నగర్ కాలనీ వద్ద వెళుతూ వినోద్ ఉన్న నిలబడి ఉన్న చోట ఆగారు. తమను చూసి ఏదో మాట్లాడుకుని నవ్వుతున్నారని దంపతులపైకి దురుసుగా దూసుకెళ్లారు. తాము కుటుంబ విషయాలు మాట్లాడుకుంటున్నామని వారిస్తున్నప్పటికీ భాస్కర్‌రెడ్డి చెప్పును చేతిలోకి తీసుకుని వీరంగం చేశాడు. అతనితోపాటు ఉన్న మరో ఇద్దరితో కలిసి దాడికి పాల్పడ్డాడు. అక్కడే ఉన్న అత్త, భార్య తాగుబోతులను అడ్డుకున్నా వారు బూతులతో మరింత దాడికి పాల్పడ్డారు. భాస్కర్‌రెడ్డితో పాటు ఉన్న పళని అనే యువకుడు తాను పోలీసు అధికారులకు ప్రైవేటు డ్రైవర్‌గా పనిచేస్తుంటానని బెదిరింపులకు దిగాడు. కొందరు స్థానికులు గొడవను కట్టడిచేసేందుకు చొరవ తీసుకుని ఆలయ ఉద్యోగి అయిన భాస్కర్‌రెడ్డిని అదుపు చేసే ప్రయత్నం చేశారు. ఆయన మాట వినకపోవడంతో చితకబాదారు. వినోద్ ఫిర్యాదు మేరకు శ్రీకాళహస్తి 1టౌన్ సీఐ గోపి వెంటనే భాస్కర్‌రెడ్డిని అతడి స్నేహితులను స్టేషన్‌కు పిలిపించి మందలించారు. మరోసారి ఇలా జరిగితే రౌడీషీట్ నమోదు చేస్తామని హెచ్చరించారు.



మంటలను అదుపు చేస్తున్న అగ్ని మాపక సిబ్బంది



తిరుమలలో కారు దగ్ధం

● ప్రయాణికులు సురక్షితం

తిరుమల, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో శనివారం రాత్రి ఓ కారు దగ్ధమైంది. కారులో ప్రయాణించిన భక్తులు సురక్షితంగా బయటపడ్డారు. బెంగళూరు వైట్‌ఫీల్డ్‌కు చెందిన భరత్ నలుగురు కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవారి దర్శనం కోసం తన కారులో శనివారం రాత్రి తిరుమలకు చేరుకున్నాడు. గది ఎలా పొందాలనే సమాచారం తెలుసుకునేందుకు బాలాజీ ఆర్టీసీ బస్టాండ్ వద్ద కారును ఆపారు. ఈ క్రమంలోనే కారు ఇంజిన్ నుంచి పొగలు రావడాన్ని గుర్తించిన భరత్ కుటుంబ సభ్యులను, లగేజీని కారు నుంచి దింపేశాడు. ఏమైందో గుర్తించేలోపే కారు నుంచి నెమ్మదిగా మంటలు రావడం మొదలైంది. సమీపంలోని భద్రతా సిబ్బంది ఫైర్ సిబ్బందికి సమాచారమిచ్చారు. ఈలోగా కారు నుంచి భారీగా మంటలు ఎగసిపడ్డాయి. అదే సమయంలో అక్కడున్న భక్తులు ఒక్కసారిగా భయభ్రాంతులకు గురయ్యారు. ఘటనా ప్రాంతానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపు చేశారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

● విభిన్న ప్రతిభావంతులకు డీఆర్వో నరసింహులు పిలుపు

తిరుపతి (కలెక్టరేట్), డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతులు ప్రభుత్వం మంజూరు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ముందుకు వెళ్లాలని డీఆర్వో నరసింహులు పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్‌లో అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. డీఆర్వో మాట్లాడుతూ ఇతరుల మీద ఆధారపడకుండా స్వయం కృషితో జీవించాలనే ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు. జిల్లా యంత్రాంగం తరపున విభిన్న ప్రతిభావంతులకు అన్ని సదుపాయాలను అందిస్తున్నట్లు చెప్పారు. విభిన్న ప్రతిభావంతుల శాఖ సహాయ సంచాలకులు శ్రీనివాస్ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల జీవన ప్రమాణాలను మెరుగు పరచడం కోసం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల అసోసియేషన్ నాయకులు మాధవ, మురళి, సుబ్రహ్మణ్యం, రెడ్డెప్ప, విజయలక్ష్మి, సుబ్రహ్మణ్యంరెడ్డి, పద్మజ, విభిన్న ప్రతిభావంతుల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

షార్‌లో 5కే రన్

సూళ్లూరుపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం షార్‌లో శనివారం ఇంటిగ్రిటీ 5కే రన్ నిర్వహించారు. దేశ శ్రేయస్సు, సంస్కృతి, సమగ్రత అనే నినాదంతో నిర్వహించిన 5కే రన్‌ను షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ ప్రారంభించారు. షార్‌లోని మిషన్ కంట్రోల్ సెంటర్ వద్దనున్న సతీష్ ధావన్ విగ్రహం వద్ద నుంచి ప్రారంభమైన 5కే రన్ అంతరిక్ష కేంద్రీయ పాఠశాల వరకు సాగింది. 5కే రన్‌లో షార్ ఉద్యోగులు, సీఐఎస్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం విజేతలకు అంతరిక్ష కేంద్రీయ పాఠశాల మైదానంలో బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో షార్ కంట్రోల్ శ్రీనివాసులురెడ్డి, గ్రూపు డైరెక్టర్ గోపికృష్ణ, శంకరన్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీసిటీలో ఈప్యాక్ పరిశ్రమ విస్తరణకు భూమిపూజ



వరదయ్యపాళెం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): శ్రీసిటీలోని ఈప్యాక్ డ్యూరబుల్ లిమిటెడ్ పరిశ్రమ, తమ అధునాతన ఉత్పత్తి కేంద్రానికి శనివారం భూమిపూజ చేపట్టింది. పరిశ్రమ ఎండీ, సీఈవో అజయ్ సింఘానియా మాట్లాడుతూ ఈప్యాక్ ప్రయాణంలో ఇదో మైలురాయి అన్నారు. మేక్ ఇన్ ఇండియా చొరవకు అనుగుణంగా దేశీయ తయారీని ప్రోత్సహించేందుకు తమ సంస్థ కృషి చేస్తుందన్నారు. శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ శ్రీసిటీకి ఇది మరో ముందడుగు అన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఎల్‌బి బోత్రా, హైసెన్స్ ఇండియా సీఈవో పంకజ్ రాణా, ఎండీ స్టీవెన్ లీ పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా పంచాయతీల అభివృద్ధి

- సర్పంచులతో ఎమ్మెల్యే నాని

తిరుపతిరూరల్, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలానికి చెందిన పలువురు సర్పంచ్‌లు శనివారం ఉదయం ఎమ్మెల్యే పులివర్తి నానీని ఇంటివద్ద కలిశారు. పుష్పగుచ్ఛం, దుశ్శాలువాతో ఎమ్మెల్యేని సన్మానించారు. ఈ సందర్భంగా పంచాయతీల్లో సమస్యలను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. పార్టీలకు అతీతంగా పంచాయతీలను అభివృద్ధి చేసుకుందామని, ఏ చిన్న సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. లింగేశ్వరనగర్, సాయినగర్, కేసీపేట, అవిలాల, బ్రాహ్మణపట్టు, పద్మావతిపురం సర్పంచ్‌లు, టీడీపీ రూరల్ మండల పార్టీ అధ్యక్షుడు ఎ.ఈశ్వర్‌రెడ్డి, కూటమి పార్టీ నేతలు గణపతినాయుడు, సునీల్‌చౌదరి, అమిలినేని మధు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే నానీతో సర్పంచ్‌లు

గంటల్లోనే చెవిరెడ్డితో భేటీ

శనివారం ఉదయం ఎమ్మెల్యే నానీని కలిసిన సర్పంచ్‌లు మధ్యాహ్నం మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డితో భేటీ అయ్యారు. పంచాయతీల్లో నిధులున్నా , రూ.50వేలకన్నా ఎక్కువ అభివృద్ధి పనులకు స్థానిక ఎమ్మెల్యే లేదా ఎంపీడీవో అనుమతి తీసుకునేలా ఆదేశించడంతో పల్లెల్లో పనులు పూర్తిచేయలేకపోతున్నామని,కార్యదర్శులు కూడా తమకు సహకరించడంలేదని చెప్పుకొచ్చారు.అభివృద్ధి పనులకు సహకరించని అధికారులను ప్రజలముందు దోషులుగా నిలబెడదామని చెవిరెడ్డి వారితో చెప్పారు.ఉదయం ఎమ్మెల్యేని కలసి సన్మానించిన సర్పంచులు గంటల వ్యవధిలోనే మాజీ ఎమ్మెల్యే ఇంటికి వచ్చి విమర్శలు చేయడం వెనుక అంతర్యమేమిటన్న చర్చ రాజకీయవర్గాల్లో నడుస్తోంది.

'నగరం' నడుస్తోంది..!

● చిత్తూరు నగరవనం, పీవీకేఎన్, మెసానికల్ మైదానాల్లో వాకర్ల సందడి

చిత్తూరు, ఆంధ్రజ్యోతి

ఉరుకుల, పరుగుల జీవితంలో ఆరోగ్యంపై దృష్టి పెట్టేవారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఒత్తిడిని చిత్తు చేసే దివ్యౌషధం నడక అని ప్రజలు గ్రహిస్తున్నారు. అందుకే చిత్తూరు నగరవాసులు నడకబాట పట్టారు. ఉదయం పూట పురుషులు, సాయంత్రం వేళల్లో మహిళలు ఎక్కువగా కనిపిస్తున్నారు.

అసోసియేషన్లుగా ఏర్పడి సేవా కార్యక్రమాలు

చిత్తూరులో ఫారెస్టు, పీవీకేఎన్ వాకర్స్ అసోసియేషన్లు ఉన్నాయి. పీవీకేఎన్ అసోసియేషన్‌లో 970 మంది సభ్యులున్నారు. రెట్టింపు సంఖ్యలో రోజూ పీవీకేఎన్ కాలేజ్ మైదానంలో వాకింగ్ చేస్తున్నారు. ఇక్కడ మూడు నెలలకోసారి షుగర్, బీపీ టెస్టులు చేయిస్తున్నారు. ఆర్నెళ్లకోసారి ఉచితంగా హెల్త్ క్యాంపులను నిర్వహిస్తున్నారు. ప్రముఖ వైద్యులు పరీక్షలు చేసి, మందులు అందిస్తున్నారు. పీవీకేఎన్ కాలేజ్ మైదానంలో ఉదయం నాలుగు నుంచి ఎనిమిది గంటల వరకు.. సాయంత్రం నాలుగు నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు వాకింగ్‌కు ఏర్పాట్లు చేశారు. రాత్రిపూట ఇబ్బంది లేకుండా మైదానంలో 18 ఫ్లడ్ లైట్లను అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. అసోసియేషన్ ఆధ్వర్యంలోనే పీవీకేఎన్ కాలేజ్ ఆవరణలో ఉచిత యోగా కేంద్రాన్ని కూడా నిర్వహిస్తున్నారు. యోగా భవనంపైనే పిరమిడ్ సెంటర్‌ను ఏర్పాటు చేయగా.. ఇక్కడ రోజూ వందమందికి తగ్గకుండా ధ్యానం చేస్తుంటారు.

రోజుకు పది వేల అడుగులు

రోజుకు పది వేల అడుగులు అనే సిద్ధాంతం ఇటీవల బాగా ప్రాచుర్యంలోకి వచ్చింది. ఆండ్రాయిడ్ సెల్‌ఫోన్లలో నడకకు, ఆరోగ్యానికి సంబంధించిన రకరకాల యాప్స్ అందుబాటులో ఉన్నాయి. ఆయా యాప్స్‌లో రోజువారీ ఎన్ని వేల అడుగులు వేయాలనే లక్ష్యం నిర్దేశించి ఉంటుంది. వైద్యులు కూడా గంటసేపు నడవండి, లేదా పది వేల అడుగులు వేయండి అంటూ సలహాలు ఇస్తున్నారు. 10వేల అడుగులంటే సుమారు 5కిలోమీటర్లు అవుతుంది.

ఈ ప్రాంతాల్లో పెద్దఎత్తున వాకింగ్

సుమారు 300 ఎకరాలతో విస్తరించిన నగరవనం చిత్తూరు నగరానికి వరంగా చెప్పుకోవచ్చు. లోపల వాకింగ్ కోసం ప్రత్యేకంగా ట్రాకుల్ని ఏర్పాటు చేశారు. ఇక్కడ ప్రకృతి ఒడిలో వాకింగ్ చేయడానికి నగరవాసులు ఆసక్తి చూపుతున్నారు.ఇక్కడ అటవీశాఖ అధికారులు రోజుకు రూ.10 గేటు ఫీజు వసూలు చేస్తుండడంతో చాలా మంది బయట మైదానాలకు వెళ్తున్నారు. దీంతోపాటు మెసానికల్, పీవీకేఎన్ గ్రౌండ్, గంగినేని, కట్టమంచి చెరువు పార్కుల్లో ఉదయం.. సాయంత్రం పెద్దఎత్తున నగరవాసులు వాకింగ్ చేస్తుంటారు. సంతపేట హైస్కూల్ గ్రౌండులోనూ అక్కడి స్థానికులు వాకింగ్ చేస్తున్నారు.


నగరవనంలో వాకింగ్ చేస్తున్న నగరవాసులు

70 ఏళ్లలోనూ నా పనులు నేనే



నేను సుమారు 20 ఏళ్లకు పైగా వాకింగ్ చేస్తున్నా. రోజూ మూడు కిలోమీటర్లు నడవడంతోపాటు ఇంట్లో ప్రాణాయామం, యోగా వంటివి కూడా చేస్తుంటా. గుడిపాల మండలం బొమ్మసముద్రం హైస్కూల్‌లో హెడ్మాస్టర్‌గా పనిచేసి రిటైరయ్యా. ఇంట్లో అన్ని పనులూ నేనే చేసుకుంటా. ఒకరి మీద ఆధారపడకుండా జీవించాలనేదే నా కోరిక.

- జయలక్ష్మి, మిట్టూరు, చిత్తూరు

బీపీ, షుగర్ కంట్రోల్‌లో ఉన్నాయి



చిత్తూరులోని హెడ్ పోస్టాఫీస్‌లో డిప్యూటీ పోస్ట్ మాస్టర్‌గా పనిచేస్తున్న నాకు పదేళ్లుగా బీపీ, షుగర్ ఉన్నాయి. వాకింగ్ చేయడమే పరిష్కారమని వైద్యులు చెప్పారు. దీంతో పదేళ్లుగా క్రమం తప్పకుండా వాకింగ్ చేస్తున్నా. ఆ రెండూ కంట్రోల్‌లో ఉన్నాయి. 61 ఏళ్ల వయసులోనూ వాకింగ్ చేయడంతో రోజంతా యాక్టివ్‌గా ఉంటున్నా.

- రాఘవేంద్రరావు, గిరింపేట, చిత్తూరు

అడుగులను లెక్కించే స్మార్ట్ వాచ్



న్యూ ఇండియా అష్యూరెన్స్ కంపెనీలో పని చేసి రిటైరయ్యా. రోజూ ఆరు వేల అడుగులు వేస్తా. ఈ స్మార్ట్ వాచ్ లెక్కపెడుతుంది.పదేళ్లుగా వాకింగ్ చేస్తున్నా. బయటి ప్రాంతాలకు వెళ్లినా వాకింగ్‌ను మాత్రం ఆపను. అందుకే పూర్తి ఆరోగ్యంగా ఉన్నా.

- నరసింహమూర్తి, దుర్గానగర్ కాలనీ,చిత్తూరు

మాత్రలు లేకుండానే ఆరోగ్యం



20 ఏళ్లుగా వాకింగ్ చేస్తున్నా. మధ్యలో కొన్నాళ్లు గ్యాప్ తీసుకుంటే షుగర్, బీపీ వచ్చింది. వైద్యుల్ని సంప్రదిస్తే రోజూ గంటసేపు వాకింగ్ చేయమన్నారు. నేను గంటన్నర సేపు వాకింగ్ చేస్తున్నా. సుమారు నాలుగేళ్లుగా మెడిసిన్ వాడకపోయినా ఆరోగ్యంగా ఉన్నా. తెల్లారి 4 నుంచి 6 వరకు ఇంట్లో వ్యాయామం చేసి ఆ తర్వాత పీవీకేఎన్ గ్రౌండ్‌కు వస్తా.

- ద్రాక్షాయిని, గాండ్లవీధి, చిత్తూరు

ఇది సేవ లాంటిదే



మా అసోసియేషన్‌లో సుమారు వెయ్యిమంది సభ్యులున్నారు. వాకింగ్ చేసేవారి కోసం అన్నిరకాల సౌకర్యాలను కల్పించాం.యోగా, ధ్యాన కేంద్రాలను ఏర్పాటు చేసి.. మెడికల్ క్యాంపుల్ని నిర్వహించి వాకర్ల ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహిస్తున్నాం.

- వీకే విశ్వనాథ్, పీవీకేఎన్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు

నేడు జిల్లా ఇన్‌చార్జి మంత్రి రాక

చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర రవాణా, క్రీడలు, యువజనశాఖ మంత్రి ఎం.రామ్‌ప్రసాద్ రెడ్డి ఆదివారం చిత్తూరుకు పర్యటనకు వస్తున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఉదయం తొమ్మిది గంటలకు రాయచోటి మీదుగా చిత్తూరుకు చేరుకుని స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో బసచేస్తారు. కొద్దిసేపు విరామం తర్వాత స్థానిక జిల్లా పరిషత్ మీటింగ్ హాలులో జరిగే డీఆర్సీ సమావేశంలో పాల్గొంటారు. భోజన విరామం తర్వాత మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జిల్లాకు చెందిన ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, ఇతర పార్టీ ఇన్‌చార్జిలతో సమావేశమౌతారు. ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారు. ఆ తర్వాత చిత్తూరు నుంచి రాయచోటికి వెళ్తారని కలెక్టర్ వివరించారు.

రెండు సినిమా థియేటర్ల సీజ్


సీజ్ చేసిన సినిమా థియేటర్

కుప్పం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కుప్పంలో లైసెన్సులు రెన్యువల్ చేసుకోని రెండు సినిమా థియేటర్లను రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. గేట్లకు తాళం వేశారు. శనివారం ఉదయం అధికారులు వెళ్లి లక్ష్మి, మహాలక్ష్మి థియేటర్లను సీజ్ చేశారు.

అడవిని దోచుకున్న పెద్దిరెడ్డి నీతులు మాట్లాడడం విడ్డూరం : టీడీపీ

చిత్తూరు సిటీ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): అడవిని దోచుకున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నీతులు మాట్లాడడం విడ్డూరంగా ఉందని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. గత వైసీపీ ప్రభుత్వంలో అటవీ శాఖ మంత్రిగా ఉన్నపుడు ఆయన చేసిన అక్రమాలపై బహిరంగ చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. గత ప్రభుత్వ హయాంలో జిల్లా అటవీశాఖలో పెద్ద ఎత్తున నిధుల దుర్వినియోగం, నిబంధనల ఉల్లంఘన, అటవీ భూముల ఆక్రమణ, అక్రమ మైనింగ్, అనుమతుల్లేకుండా రోడ్ల నిర్మాణం వంటి వాటిపై విజిలెన్స్ విచారణ జరిపించాలని ప్రభుత్వానికి లేఖరాసినట్లు పేర్కొన్నారు.

రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యంగా పనిచేస్తున్నాం


ఎంపీ ప్రసాదరావు

చిత్తూరు సిటీ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యంగా కూటమి ఎంపీలు పనిచేస్తున్నారని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని రంగాల్లో రాష్ట్రానికి ప్రాధాన్యం ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశామన్నారు. వాతావరణ కార్యాలయాలు, జాతీయ విపత్తు కేంద్రాల నిర్వహణకు సంబంధించిన వివరాలు కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాసినట్లు పేర్కొన్నారు. వీటిపై కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించడమే కాకుండా.. సంబంధిత శాఖల నుంచి సమాధానమిస్తూ లేఖలు పంపించినట్లు ఆప్రకటనలో వివరించారు.

ద్విచక్ర వాహనం ఢీకొని మహిళ మృతి

చిత్తూరు అర్బన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనం ఢీకొని ఓ మహిళ మృతి చెందారు. ట్రాఫిక్ ఏఎస్ఐ లక్ష్మీపతి తెలిపిన వివరాల మేరకు.. చిత్తూరు గిరింపేట కొలిమివీధికి చెందిన గాయత్రి (55) రోజూ జ్యోతిరెడ్డినగర్‌లో ధ్యానం చేసుకోవడానికి వెళుతోంది. శనివారం కూడా ధ్యానం ముగించుకుని ఇంటికి రావడానికి రోడ్డు దాటుతుండగా.. చిత్తూరు నుంచి జీడీ నెల్లూరు వైపు ద్విచక్రవాహనంలో వేగంగా వెళుతున్న ఓ వ్యక్తి ఆమెను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఆమె తలకు బలమైన గాయమైంది. చికిత్స కోసం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చిరుత సంచారంతో రైతుల భయాందోళన


చిరుత సంచరించిన యల్లకుంట్ల గుట్ట

చౌడేపల్లె, డిసెంబరు7: (ఆంధ్రజ్యోతి) : యల్లకుంట్ల గుట్ట వద్ద శనివారం చిరుత సంచరిస్తున్నట్లు గమనించిన రైతులు భయభ్రాంతులయ్యారు. వెంటనే పొలాల నుంచి పారిపోయారు. ఈ గ్రామం చౌడేపల్లె-పుంగనూరు ప్రధాన రోడ్డుకు సమీపంలో ఉంది. గ్రామస్థులు పొలాల్లోకి వెళ్లాలంటే హడలిపోతున్నారు. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బయటకు అడుగుపెడుతున్నారు. ఈవిషయంపై ఎఫ్ఆర్‌వో శ్రీరాములు మాట్లాడుతూ స్థలానికి వెళ్లి పరిశీలించాలని ఎఫ్‌బీవో యువరాజ్, ఎఫ్ఎస్‌వో రాకేష్‌లను ఆదేశించామన్నారు. రైతులు అటవీ సమీప ప్రాంతాలకు వెళ్లేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

కారు ఢీకొని బాలిక దుర్మరణం

పూతలపట్టు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కారు ఢీకొని ఓ బాలిక దుర్మరణం చెందింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పూతలపట్టు మండలంలోని పేట అగ్రహారం పంచాయతీ ఎస్టీ కాలనీకి చెందిన వాణిశ్రీ (14) శుక్రవారం రాత్రి బూజు కర్రలను బెంగళూరుకు తీసుకెళ్లడానికి రంగంపేట క్రాస్‌రోడ్డు సమీపాన ఉన్న సిక్స్‌లేన్ రోడ్డు దాటుతుండగా.. తిరుపతి నుంచి చిత్తూరు వైపు వస్తున్న కారు వేగంగా వచ్చి ఢీకొట్టింది. తీవ్రగాయాలైన బాలిక బాలిక అక్కడికక్కడే మృతిచెందింది. సీఐ కృష్ణమోహన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుప్పంలో ప్రకృతి వ్యవసాయానికి పెద్దపీట


ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కుప్పం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయానికి పెద్దపీట వేయాలని ప్రజాప్రతినిధులు, అధికారులు నిర్ణయించారు. స్థానిక ఆర్‌అండ్‌బి అతిథిగృహంలో శనివారం సమీక్ష జరిగింది. కుప్పం నియోజకవర్గంలో ప్రకృతి వ్యవసాయానికి అవసరమైన కార్యాచరణ ప్రణాళిక తయారు చేసేందుకు సమాయత్తమయ్యారు. అంతకుముందు వ్యవసాయ శాఖ ప్రభుత్వ సలహాదారు టి.విజయకుమార్, కడా పీడీ వికాస్ మర్మత్, ఉద్యాన శాఖ అధికారులతో కలిసి ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించారు. అనంతరం వారితో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యమిస్తున్నదని చెప్పారు. ప్రభుత్వ సలహాదారు టి.విజయకుమార్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం విశిష్టత తెలియజేశారు. కడా పీడీ మాట్లాడుతూ నియోజకవర్గంలో 18,009 మంది రైతులు 20,052 ఎకరాల విస్తీర్ణంలో ప్రకృతి వ్యవసాయాన్ని అనుసరిస్తున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ, ఉద్యాన అధికారులు మురళీకృష్ణ, మధుసూదన్ రెడ్డి, డీపీఎం వాసు, అడిషనల్ డీపీఎం శ్రీనివాస్ రావు, రాష్ట్ర అధికారి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆరు చోట్ల రెవిన్యూ సదస్సులు

163 అర్జీల రాక


వి.కోట మండలం తోటకనుమలో అర్జీలందుకుంటున్న తహసిల్దార్ పార్వతి

చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): భూవివాదాల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం చేపట్టిన రెవిన్యూ సదస్సులు రెండో రోజైన శనివారం ఆరుచోట్ల నిర్వహించారు. కుప్పం డివిజన్‌లో రెండు, పలమనేరు డివిజన్‌లో నాలుగు రెవిన్యూ గ్రామాల్లో సదస్సులు జరగ్గా 163 అర్జీలందాయి.వీటిలో 22ఏ అంశంపై 49, రికార్డ్ ఆఫ్ రైట్స్ పై 61, అసైన్‌మెంట్ ల్యాండ్ అంశంపై 11 అర్జీలందాయి. అన్ని గ్రామాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సదస్సులు జరుగగా, తహసీల్దార్, రెవిన్యూ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు. ఎలాంటి భూసమస్యలు ఉన్నా దరఖాస్తులు ఇచ్చి పరిష్కరించుకోవాలని అధికారులు కోరారు. పాస్ బుక్, మ్యుటేషన్, సర్వే సమస్యలు ఏదైనా ఉంటే యూజర్ ఛార్జీలు లేకుండా ఆన్‌లైన్‌లో పేరు నమోదు చేసుకుంటే పరిష్కరించుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు.

సాయుధ దళాల పాత్ర వెలకట్టలేనిది : కలెక్టర్


విరాళాన్ని అందజేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సాయుధ దళాల నిధికి విరాళాలను అందించి సహకరించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ కోరారు. శనివారం సాయుధ దళాల పతాక దినోత్సవం సందర్భంగా కలెక్టర్ బంగ్లాలో నిర్వహించిన కార్యక్రమంలో ఫ్లాగ్ డే నిధికి విరాళాల సేకరణను ఆయన ప్రారంభించారు. దేశరక్షణలో సాయుధ దళాల పాత్ర వెలకట్టలేనిదన్నారు. ప్రాణాలు కోల్పోయిన సైనికులను స్మరించుకునేందుకు ఏటా డిసెంబరు 7న దేశవ్యాప్తంగా ఫ్లాగ్‌డే నిర్వహిస్తున్నట్లు చెప్పారు. త్యాగధనుల కుటుంబాల్లోని పిల్లలకు స్కాలర్‌షిప్, ఆడపిల్లలకు వివాహాలు తదితర కార్యక్రమాలకు ఫ్లాగ్‌డే ఫండ్ ఉపయోగపడుతుందన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు జిల్లా సైనిక సంక్షేమ అధికారి కేవీ రాఘవులు సైనిక జెండాను అందజేశారు. కలెక్టర్ తన వంతు విరాళాన్ని అందజేశారు. ఎన్‌సీసీ క్యాడెట్లు, మాజీ సైనికులు వరదరాజులు, రామచంద్ర, అధికారులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కారం కాకపోతే.. మండల మీట్‌ను బాయ్‌కాట్ చేయండి

● ఎంపీటీసీలు, సర్పంచులకు జీడీనెల్లూరు ఎంపీడీవో పిలుపు



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎంపీపీ అనిత

గంగాధరనెల్లూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు పరిష్కారం కాకుంటే తదుపరి మండల మీట్‌ను సభ్యులు బాయ్‌కాట్ చేయాలని ఎంపీడీవో హరిప్రసాద్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఎంపీడీవో మీటింగ్ హాలులో శనివారం ఎంపీపీ అనిత అధ్యక్షతన గంగాధరనెల్లూరు మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. సభ్యులు తెలియజేసిన సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి అయినా పరిష్కరించి, వారిని గౌరవించాలని సూచించారు. వైసీపీకి చెందిన జడ్పీటీసీ లక్ష్మీప్రియ మాట్లాడుతూ.. గత మండలమీట్‌లో సభ్యులు తెలిపిన సమస్యలను అధికారులు పరిష్కరించకుండా పెండింగ్ పెడుతున్నారని చెప్పారు. గంగాధరనెల్లూరు హైస్కూల్లో టీచర్లు, హెచ్ఎంల మధ్య సమన్వయం లేక విద్యాబోధన సరిగా లేకపోవడంతో చాలామంది విద్యార్థులు ఇతర బడులకు వెళ్లిపోతున్నారని పలువురు సభ్యులు ధ్వజమెత్తారు. బుక్కాపట్నం సర్పంచ్ మునిరాజారెడ్డి మాట్లాడుతూ ఎన్ఆర్‌హెచ్ఎం నిధులు.. సర్పంచ్, ఆశవర్కర్ జాయింట్ అకౌంట్‌లో చాలా రోజులుగా మురిగిపోతున్నాయని, సకాలంలో ఖర్చుపెట్టాలని కోరారు. కలిజవేడు, వెజ్జుపల్లె సర్పంచ్‌లు నీలావతి, హరిప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ.. గోకులం షెడ్లను అర్హులందరికీ ఇప్పించాలని డిమాండ్ చేశారు. చిన్నవేపంజేరి సర్పంచ్ ఝాన్సీ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో నిర్వహించిన రీసర్వేలో తమభూములు ఉండాల్సిన దానికంటే తక్కువ చూపిస్తోందని తెలిపారు. గుంతల రోడ్లను బాగు చేయాలని సభ్యులు సూచించారు. సభ్యుల ప్రశ్నలకు హౌసింగ్ ఏఈ శ్రీధర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బిందుమాలతి, తహసీల్దార్ చంద్రశేఖర్, ఇన్‌చార్జి ఆర్‌అండ్‌బీ ఏఈ ఆదికేశవులు, విద్యుత్‌శాఖ ఏఈ వరదరాజ సమాధానాలిచ్చారు. సచివాలయాల్లో జేఏల్ఎంలు రోజూ కనీసం రెండు గంటల పాటు ఉండేలా చర్యలు తీసుకోవాలని ఏఈలను ఎంపీడీవో ఆదేశించారు.

కోలాహలంగా స్కంద షష్ఠి వేడుకలు



విశేష అలంకరణలో సుబ్రహ్మణ్యస్వామి- కళ్యాణోత్సవానికి హాజరైన భక్తులు

రామకుప్పం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో శనివారం స్కందషష్టి వేడుకలు కోలాహలంగా జరిగాయి. తెల్లవారుజామున అమ్మవారు, స్వామివారికి ప్రత్యేక అభిషేకపూజలు నిర్వహించారు. నాగులపుట్ట వద్ద భక్తులు పాలు, పండ్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఉభయదారులు రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు కృష్ణమూర్తిస్వామి కుటుంబసభ్యులు ఆధ్వర్యంలో స్వామి వారి కల్యాణోత్సవం నేత్రపర్వంగా జరిగింది. చివరగా మహామంగళహారతి నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు అన్నదానం చేశారు. నాగులమ్మ, శనీశ్వరస్వామి, వేంకటేశ్వర స్వామి, పద్మావతి అమ్మవారి ఆలయాలు కిటకిటలాడాయి.

మామిడి ఉత్పత్తులు వాడేలా చర్యలు తీసుకోవాలి



రౌండ్ టేబుల్ సమావేశంలో మామిడి రైతులు

చిత్తూరు సెంట్రల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మామిడి ఉత్పత్తులను ప్రజలు, వ్యవస్థలు, సంస్థలు విరివిగా వాడేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్ సభ్యులు విజ్ఞప్తి చేశారు. మామిడి సాగు, సస్యరక్షణ చర్యలు, ఖర్చులు, నీటి యాజమాన్య పద్ధతులు, ఉత్పత్తులు, వినియోగం, గుజ్జు పరిశ్రమల ఉనికి, రైతులకు నగదు చెల్లింపులు తదితర అంశాలపై శనివారం స్థానిక మ్యాంగో భవన్‌లో ఉద్యాన, సంబంధిత శాఖ అధికారులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఉద్యాన శాఖాధికారి మధుసూదన్ రెడ్డి, మార్కెటింగ్ శాఖ ఏడీ పరమేశ్వర్, ఆత్మ పీడీ సావిత్రి, సంఘం సౌత్‌జోన్ ఛైర్మన్ కట్టమంచి బాబి, గుజ్జు పరిశ్రమల యజమాన్యాలు తలపలపల్లి బాబురెడ్డి, బాలాజీ, చంద్రమోహన్, శ్రీధర్ పాల్గొన్నారు.

వసతి గృహం ప్రహరీ పనులకు శ్రీకారం



రొంపిచెర్ల, డిసెంబరు7:(ఆంధ్రజ్యోతి) మండల కేంద్రంలోని బాలుర వెనుకబడిన తరగతి విద్యార్థుల వసతి గృహం ప్రహరీ గోడ పనులు ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి. ఈగోడ కూలి రెండేళ్లయింది. వసతిగృహంలోకి పశువులు, విషపురుగులు వస్తుంటాయి. భవనానికి రెండు వైపులా ప్రహరీ పడిపోయింది. దీనిపై ఆంధ్రజ్యోతిలో కథనం వెలువరించింది. జిల్లా కలెక్టరు ఇటీవల మండల పర్యటకు వచ్చారు. ఈ సమస్య గురించి తెలుసుకుని ప్రహరీ గోడ నిర్మాణానికి రూ 6.లక్షలు మంజూరు చేశారు. దీంతో కాంట్రాక్టర్ పనులకు స్వీకారం చుట్టారు

బీసీ హాస్టల్ విద్యార్థులకు క్రీడా సామగ్రి పంపిణీ



కుప్పం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కుప్పంలోని ప్రభుత్వ బీసీ హాస్టల్ విద్యార్థులకు శనివారం కుప్పం ఇంజినీరింగ్ కళాశాల, లయన్స్ క్లబ్‌లు సంయుక్తంగా రూ.20 వేల విలువ కలిగిన క్రీడా సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ ఛైర్మన్ డాక్టర్ సునీల్ రాజ్ మాట్లాడుతూ చదువులోనైనా ఇతర ఏ రంగంలోనైనా రాణించాలంటే శారీరక, మానసిక దృఢత్వం అవసరమన్నారు. కార్యక్రమంలో కుప్పం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సోమశేఖర్, సలహాదారు మహేశ్, డైరెక్టర్లు సత్యేంద్రశేఖర్, నితిన్ కుమార్, షరీఫుల్లా, హాస్టల్ వార్డెన్ మురళీ నాయక్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంలో కొరవడిన నాణ్యత



భోజనం చేస్తున్న విద్యార్థుల మధ సంచరిస్తున్న కుక్క

చౌడేపల్లె, డి సెంబరు7:(ఆంధ్రజ్యోతి): చారాల హైస్కూల్‌లో శనివారం పేరెంట్స్ డే సందర్భంగా కూడా నాణ్యతలేని భోజనాన్ని పెట్టారని విద్యార్థుల తల్లిదండ్రులు పెదవి విరిచారు. కొందరు విద్యార్థులు పూర్తిగా తినకుండానే వదిలేశారు. డైనింగ్ రూంలో విద్యార్థులు భోజనం చేస్తుంటే మరో పక్క ఓ కుక్క సంచరిస్తోంది. ఉపాధ్యాయులు పర్యవేక్షణ లోపించిందని స్థానికులు పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

రాజనాలబండలో ప్రత్యేక పూజలు



చౌడేపల్లె, డిసెంబరు7:సత్యప్రమాణాలకు నిలయమైన రాజనాలబండలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొండపై స్వయంభు లక్ష్మినరసింహస్వామికి, కొండ కింద బండపై అభయ ఆంజనేయస్వామికి ఆలయ నిర్వహకులు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు మొక్కులు చేసుకున్నారు. అన్నదానం నిర్వహించారు.

బెల్ట్‌షాపులపై చర్యలేవీ: సర్పంచుల ఆగ్రహం

గుడిపల్లె, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో విచ్చల విడిగా బెల్టుషాపుతో నిర్వహించి అక్రమ మద్యం జోరుగా సాగుతున్న అధికారులు పట్టించుకోవడంలేదని ప్రజా ప్రతినిధులు ధ్వజమెత్తరు. శనివారం మండల స్త్రీశక్తి భవనంలో మండల సర్వ సభ్య సమావేశం ఎంపీపీ వరలక్ష్మీ అధ్యక్షతన జరిగింది. కనమనపల్లె, మిద్దురు గ్రామాల్లో బెల్టుషాపులు నిర్వహిస్తున్నారన్నారు. అధికారులు పట్టించుకోలేదని కనమనపల్లె సర్పంచ్ భాస్కర్ మండిపడ్డారు. సంగనపల్లె, గుడుపల్లె పంచాయతీ సర్పంచులు కూడా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ కుప్పం నియోజవర్గం సీఎం ప్రాతినిధ్యం వహిస్తున్న విషయం అధికారులు గుర్తుపెట్టుకొని బాధ్యతగా పనిచేయలన్నారు. తహసిల్దార్ సీతారాం, జడ్పిటీసీ క్రిష్ణమూర్తి, వైస్ ఎంపీపీ శ్రీనివాసులు, అన్ని శాఖల అధికారులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

పుంగనూరు రూరల్, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంఎం పెట్రోల్ బంకు వద్ద రెండు శనివారం ద్విచక్రవాహనాలు ఢీకొని ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుని కథనం మేరకు వివరాలు.. పట్టణ సమీపంలోని నక్కబండ కాలనీకి చెందిన సుబ్రహ్మణ్యం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో కాంట్రాక్ట్ కార్మికుడిగా పని చేస్తున్నాడు. ఉదయం నక్కబండ కాలనీ నుంచి ఆసుపత్రి విధులకు వెళుతూ ద్విచక్రవాహనానికి పెట్రోల్ పట్టుకుని రోడ్డు దాటుతుండగా ఓ ఉపాధ్యాయుడు ద్విచక్రవాహనంతో ఢీకొన్నాడు. దీంతో సుబ్రహ్మణ్యం గాయపడ్డాడు. స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి ఆందోళనగా ఉండటంతో మదనపల్లెకు తరలించారు.

పి.కొత్తకోట పశువుల ఆస్పత్రికి నిధులు : కలెక్టర్ హామీ

పూతలపట్టు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పి.కొత్తకోట పశువుల ఆస్పత్రికి నిధులు మంజూరు చేస్తానని కలెక్టర్ సుమిత్‌కుమార్ హామీ ఇచ్చారు. శనివారం పీటీఎం ముగిశాక ఎమ్మెల్యే మురళీమోహన్ సూచనతో పశువుల ఆస్పత్రి వద్దకెళ్లి భవనాన్ని పరిశీలించారు. వర్షం కురిస్తే భవనం పూర్తిగా ఉరుస్తుందని అధికారులు చెప్పగా, రూ.5 లక్షలు మంజూరు చేస్తానని కలెక్టర్ చెబుతూ.. సంబంధిత అధికారులను అక్కడికక్కడే పిలిచించి, నివేదికలు పంపాలని ఆదేశాలు జారీచేశారు. అక్కడినుంచి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వరకు ఎమ్మెల్యే మురళీమోహన్‌తో పాటు నడిచి వెళ్లి వైద్యులతో మాట్లాడారు. రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని.. ఆస్పత్రి అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం చిత్తూరు-తిరుపతి సిక్స్ లేన్ వద్ద లింకురోడ్డు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని ఎమ్మెల్యే చెప్పారు. ముఖ్యంగా వేము ఇంజనీరింగ్ కళాశాల వద్ద ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. అందువల్ల కొత్తకోట, వేము కళాశాల వద్ద ప్రజలు, విద్యార్థుల సౌకర్యార్థం లింకు రోడ్డు ఏర్పాటుచేయాలని కోరగా, పరిష్కరిస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు.

భగవద్గీత పోటీలు

చిత్తూరు కల్చరల్, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణవీధి గీతాభవనంలో శనివారం టీటీడీ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో విద్యార్థులకు భగవద్గీత పోటీలు జరిగాయి. 70 మంది విద్యార్థులు పాల్గొన్నారు. సీనియర్ విభాగంలో పరిణిత, లక్ష్మేశ్వరి, జూనియర్ విభాగంలో ఎ.మోహనక్రిష్ణ, వి.భవిష్య గెలుపొందారు. విజేతలను విజయం విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ శైలజామూర్తి, భద్రావతి అభినందించారు.

గుర్తు తెలియని వృద్ధురాలు మృతి



పలమనేరు, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఆర్టీసీ బస్టాండులో శనివారం ఉదయం సుమారు 70 ఏళ్ల వయస్సు ఉన్న వృద్ధురాలు మృతిచెందింది. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులకు విచారించారు. ఆమె ఎవరనేది తెలియలేదు. మున్సిపాల్ పారిశుధ్య సిబ్బంది సహకారంతో ఆమె మృతదేహాన్ని ఖననం చేయించారు.

పాఠశాలకు నామఫలకం వితరణ

పలమనేరు, డిసెంబరు(ఆంధ్రజ్యోతి) : స్థానిక లక్ష్మీనగర్ కాలనీలో మండల పరిషత్ పాఠశాల ఏర్పాటుచేసి 22 ఏళ్లయినా నామఫలకం లేదు. స్థానిక సంఘ సేవకులు శ్రీపురం సీతారామయ్య సుమారు రూ. 10 వేలతో పాఠశాలకు నామఫలకం ఏర్పాటు చేశారు. దీనిని శనివారం దాతతో ప్రారంభింపజేశారు. దాత శ్రీపురం సీతారామయ్యకు ఎంఈఓ బాలసుందరం కృతజ్ఞతలు తెలియజేశారు. నరేంద్రబాబు, ప్రధానోపాధ్యాయులు జయంతి, ఉపాధ్యాయులు,తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఆధార్ శిబిరాలు

కుప్పం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కొత్త కార్డుల నమోదు, పొరపాట్లు సరిదిద్దడంకోసం ఈనెల 9,10 తేదీల్లో పలు ఆధార్ శిబిరాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సాయి లహరి తెలిపారు. ఈనెల 9న మల్లానూరు జడ్పీ హైస్కూల్, అడవిబూదుగూరు, పైపాళ్యం, గోనుగూరు, నూలుకుంట, చందం జడ్పీ హైస్కూళ్లలో ఆధార్ శిబిరాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈనె 10వ తేదీన దాసేగానూరు, గరిగచీనేపల్లె, పీజీ పల్లె, కంగుంది జడ్పీ హైస్కూళ్లు, కుప్పం ఏపీఎంఎస్, చిన్నవోబనపల్లె జడ్పీ హైస్కూళ్ల శిబిరాలు జరుగుతాయన్నారు.

ఎమ్మెల్యే అమర్ నివాళులు



పలమనేరు, డిసెంబరు(ఆంధ్రజ్యోతి): టి.ఒడ్డూరులో శనివారం దేవరాజులు భౌతిక కాయానికి ఎమ్మెల్యే అమరనాథరెడ్డి నివాళులు అర్పించారు. మండల బీసీ సెల్ నాయకుడు స్వతంత్ర్యబాబు సోదరుడు దేవరాజులు అనారోగ్యంతో మృతిచెందారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు నాగరాజరెడ్డి, నాయకులు జగదీష్‌నాయుడు, పెద్దబ్బ, రామచంద్ర, స్వతంత్ర్యబాబు పాల్గొన్నారు.

అయ్యప్ప సేవలో పెద్దిరెడ్డి

సదుం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి శనివారం అయ్యప్ప మాలధారణలో ఎర్రాతివారిపల్లెలోని అయ్యప్పస్వామిని దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయ రీతిలో ఆయనకు స్వాగతం పలికారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

9న పూర్వ విద్యార్థుల సమావేశం

పుంగనూరు, డిసెంబరు 7: శుభారాం ప్రభుత్వ డిగ్రీకాలేజీ పరిశీలనకు ఈనెల 9న నాక్ కమిటీ వస్తున్న నేపధ్యంలో పూర్వ విద్యార్థుల సమావేశం ఏర్పాటు చేసినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్.హరినాథరెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటలకు జరిగే పూర్వ విద్యార్థుల సమావేశానికి హాజరై నాక్ కమిటీతో అభివృద్ధి, కాలేజీ స్థాయి పెంపు అంశాలను వివరిస్తామన్నారు.

సారా స్వాధీనం మహిళ అరెస్ట్

పుంగనూరు రూరల్, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): రెండుచోట్ల దాడులు నిర్వహించి 72లీటర్లు నాటు సారా, మరో చోట ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకుని మహిళను అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ సురేశ్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. పత్రపట్ల తాండాకు చెందిన మునికుమారి సమీపంలోని పెద్దపాళ్యం చెరువు వద్ద 60లీటర్ల సారా స్వాధీనం చేసుకుని నిందితురాలిని అరెస్టు చేశామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. నల్లగుట్లపల్లె తాండా సమీపంలోని వ్యవసాయ పొలాల్లో నిల్వ ఉంచిన 1000లీటర్ల బెల్లం ఊట స్థావరాలను గుర్తించి ధ్వంసం చేశామన్నారు. పెద్దపంజాణి మండలం పొట్టగానిపల్లె బస్టాండ్ వద్ద 12లీటర్లు సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

చిత్తూరు అర్బన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పెనుమూరు పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ సెప్టెంబరు నెలలో అనారోగ్యంతో మృతి చెందిన ఏఎస్ఐ సూరిబాబు సతీమణి సుజాతకు ఏఎస్పీ రాజశేఖర్‌రావు ఆర్థికసాయం చేశారు. అలాగే వెదురుకుప్పం పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మరణించిన హెడ్‌కానిస్టేబుల్ భార్య హేమలతకు కూడా ఆర్థికసాయం చేశారు. ఒక్కొక్కరికి కార్పస్ ఫండ్ నుంచి రూ.లక్ష చొప్పున రూ.2లక్షలకు సంబంధించిన చెక్కులను అందించారు. బీసెక్షన్ సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం, క్లర్క్ పార్థసారధి నాయుడు పాల్గొన్నారు.

నిండాముంచిన ఫెంగల్ తుఫాన్

- టమోటా తోటలకు తెగుళ్లు
- నష్టాలబాటలో అన్నదాత



కోతలు చేయక ముందే వర్షాలకు దెబ్బ తిన్న టమోటా తోటలు

సోమల, డిసెంబరు 7: ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో చెరువులకు జలకళ వచ్చినా మరోపక్క టమోటా రైతులు భారీగా నష్టపోతున్నారు. ఎకరాకు రూ.1.50 లక్షలు ఖర్చుచేశారు. వారంపాటు వీడని వర్షం వల్ల టమోటా తోటలకు అంతుచిక్కని తెగుళ్ల సోకాయి. రైతుల ఆశలను అడియాసలు చేశాయి. రెండు రోజుల వ్యవధిలోనే తోటలు నల్లగా మారిపోయాయి. పచ్చి టమోటాలు నేల రాలిపోయాయి. మండలంలో 400 ఎకరాల్లో టమోటా తోటలు దెబ్బ తిన్నాయి. సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో నాటిన తోటల్లో తొలి కోతల దశలో వర్షం దెబ్బ తగిలింది. కాపాడు కోవడానికి పెట్టుబడులు పెట్టినా ప్రయోజనం లేకపోయింది. అగ్గి తెగులు, మచ్చల తెగులు, ఆకు రాలే రోగం, చీడ తెగుళ్లతో రైతులు కుదేలయ్యారు. నివారణ పద్ధతులు చేప్పే నాథుడు లేక నష్టపోయామని రైతులు వాపోతున్నారు.

తోటలోనే టమోటాలు వదిలేశా



అక్టోబరులో సాహో రకం నాలుగు వేలు మొక్కలు సాగు చేశా. దిగుబడి బాగా వచ్చింది. పది రోజుల్లో కోయాల్సి ఉంది. తుఫాన్ దెబ్బతో తోట నల్లగా మారిపోయింది. కాయలు నేల రాలిపోతున్నాయి. మందులు స్ప్రే చేసినా ఫలితం లేకపోయింది. నేల రాలిన టమోటాలను తోటలోనే వదిలేశాం. ఉద్యానాధికారులు పరిశీలించి నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలి.

- సురేంద్ర, టమోటా రైతు, సోమల

తీరని నష్టం



వేలకు వేలు పెట్టుబడిగా పెట్టి సాగు చేస్తే విడవని వర్షంతో టమోటాకు అంతు చిక్కని రోగాలు సోకాయి. మందులకు చాలా ఖర్చు చేశాను. నివారణ జరగలేదు. సలహా ఇచ్చేవారే లేరు. రోగాలు తగ్గలేదు. నష్ట పరిహారం మంజూరు చేయలి

- శెట్టివారి నాగరాజ, రైతు, సోమల

ప్రభుత్వ పాఠశాలల్లో వెల్లివిరిసిన ఉత్సాహం



రాయలపేట సమావేశంలో ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

పెద్దపంజాణి/కుప్పం/కల్లూరు/రొంపిచెర్ల/రామకుప్పం/ సోమల/పలమనేరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): అన్ని పాఠశాలల్లో శనివారం పేరెంట్స్‌టీచర్స్ సమావేశాలు ఘనంగా నిర్వహించారు. పండగ వాతావరణం నెలకొంది. స్కూళ్లలో ముగ్గులు వేసి ప్రత్యేక శోభ తెచ్చారు. రాయలపేట జడ్పీఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మధ్య మంచి అనుబంధాన్ని ఏర్పరచడానికి ఈ సమావేశాలు దోహదపడతాయన్నారు. ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు..స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భస్థ శిశువుల సౌకర్యార్థం గుండ్లపల్లెకు చెందిన పారిశ్రామిక వేత్త సునిల్‌రెడ్డి సమకూర్చిన నియోనేటల్ రేడియంట్ వార్మర్ విత్ ఫోటో థెరపీ మిషన్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ● కుప్పం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ హాజరయ్యారు. జిల్లా పరిషత్తు బాలికోన్నత పాఠశాలలో తల్లిదండ్రులకు ఆటలపోటీలు నిర్వహించి బహుమతులు పంచిపెట్టారు. గుడిపల్లె కస్తూరిబా గురుకుల పాఠశాల విద్యార్థులతో కలసి ఎమ్మెల్సీ భోజనం చేశారు. ● పులిచెర్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన సమావేశానికి టీడీపీ ఇన్‌చార్జ్ చల్లా రామచంద్రారెడ్డి హాజరయ్యారు. క్రీడా పోటీలను ప్రారంభించారు. బహుమతులు అందజేశారు. .● రొంపిచర్ల బాలికల ఉన్నత పాఠశాల, బాలుర ఉన్నత పాఠశాల, ఉర్దూ పాఠశాల, ఆదర్శపాఠశాలలో జరిగిన కార్యక్రమంలో చల్లారామచంద్రారెడ్డి పాల్గొన్నారు. ఆదర్శపాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ● రామకుప్పం మండలంలో వివిధ పాఠశాల్లో జరిగిన ఉపాధ్యాయులు-తల్లిదండ్రుల సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.సురేష్, ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పత్రనారాయణాచారి, ఆనందరెడ్డి, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.● సోమల, కందూరు, పెద్దఉప్పరపల్లె, నంజంపేట, నూరయ్యగారిపల్లె ఉన్నత పాఠశాలల్లో జరిగిన సమావేశాల్లో పూర్వ విద్యార్థులు కూడా పాల్గొన్నారు. వి.కోట బాలికోన్నత పాఠశాల జరిగిన సమావేశంలో జిల్లాపరిషత్ ఛైర్మెన్ శ్రీనివాసులు పాల్గొన్నారు.



పులిచెర్ల పీటీఎంలో చల్లా రామచంద్రారెడ్డి



గుడిపల్లెలో విద్యార్థులతో ఎమ్మెల్సీ శ్రీకాంత్ సహపంక్తి భోజనం



వి.కోట సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ ఛైర్మెన్ శ్రీనివాసులు

సీఎం చంద్రబాబును కలిసిన శాంతిపురం నేతలు



శాంతిపురం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును కొత్తపేట, నడింపల్లె గ్రామస్తులు శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. తమ గ్రామాల్లో సమస్యలపై వివరించారు. కొత్తపేటలోని వెంకటేశ్వరస్వామి దేవాలయ నిర్మాణానికి రూ.1.10 కోట్లు మంజూరు చేసినట్లు జిల్లా టీడీపీ బీసీ సెల్ కార్యనిర్వాక కార్యదర్శి జయరాం తెలిపారు. సీఎంను కలిసిన వారిలో నాగరాజు, జయరాం, శివ, నాగిరెడ్డి తదితరులున్నారు.

రెవెన్యూ సదస్సులో 25 అర్జీలు

వి.కోట, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): దీర్ఘ కాలంగా అపరిష్కృతంగా ఉన్న భూసమస్యల పరిష్కారానికి ప్రభుత్వం రెవిన్యూ సదస్సులు నిర్వహిస్తోందని తహసిల్దార్ పార్వతి చెప్పారు. శనివారం మండల పరిధిలోని తోటకనుమ పంచాయతీ కేంద్రంలో జరిగిన రెవెన్యూ సదస్సుకు 25 సమస్యలు వచ్చాయి. ఇందులో మూడు సర్వేకు సంబంధించినవి. మిగిలినవి రెవెన్యూకు చెందినవిగా గుర్తించారు. 41 రోజుల్లోపు ఫిర్యాదులను పరిష్కరించి ప్రజలకు పూర్తి వివరాలతో కూడిన నివేదికను అందిస్తామన్నారు. ఏఎంసీ ఛైర్మెన్ రామచంద్రనాయుడు, రంగనాథ్, సర్పంచ్ భాగ్యమ్మ, ఎంపీటీసీ అరుణాచలరెడ్డి తదితరులు పాల్గొన్నారు

స్మార్ట్‌లాక్‌ల వినియోగంపై అవగాహన



స్మార్ట్‌లాక్‌లు అందజేస్తున్న పోలీసులు

బైరెడ్డిపల్లె, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): చోరీలను అరికట్టడానికి వినూత్నంగా రూపొందించిన స్మార్ట్ లాక్‌ల గురించి శనివారం బైరెడ్డిపల్లె పోలీస్‌స్టేషన్ వద్ద పలమనేరు రూరల్ సిఐ మురళీమోహన్ ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజలు బయట ప్రాంతాలకు వెళ్లేటప్పుడు ఇళ్లకు, రైతులు వ్యవసాయపంపు సెట్ల వద్ద స్మార్ట్‌లాక్ చేయడంవల్ల ఎవరైనా చోరీకి ప్రయత్నిస్తే వెంటనే సైరన్ మోగుతుందన్నారు. దీనివల్ల చుట్టుపక్కలవారు అప్రమత్తమై చోరీలను అరికట్టడానికి ఉపయోగపడుతుందని వివరించారు. తక్కువ ధరకు లభించే స్మార్ట్‌లాక్‌లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వీటిని కొనుగోలు చేసినవారికి సిఐ స్మార్ట్‌లాక్‌లను అందజేశారు. ఎస్ఐ పరశురాముడు,సిబ్బంది పాల్గొన్నారు.

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిషోర వికాసం



మహిళలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

వి.కోట, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): టీనేజ్‌లో గర్భవతులకు చాలా రకాల ఇబ్బందులుంటాయని ఓగు వైద్యాధికారి డాక్టర్ మాధవీలత అన్నారు. శనివారం వెలుగు భవనంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిషోర వికాసం కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు, మహిళా పోలీసులకు బాల్య వివాహ నిరోధక చట్టం, టీనేజ్ ప్రెగ్నెన్సీ వల్ల కలిగే నష్టాలు, ఆరోగ్యం, పోషణ, రుతుక్రమంలో పాటించాల్సిన శుభ్రత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. పోక్సో చట్టం, మానవ అక్రమ రవాణా నిరోధక చట్టంపై కూడా శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో సీసీ లావణ్య, లీగల్ అడ్వైజర్ రేఖ, సూపర్‌వైజర్లు లత, మాధవీలత, సుజాత, రాధా, మహిళా పోలీసులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు బైరెడ్డిపల్లెలో దళిత సంఘాల సమావేశం

బైరెడ్డిపల్లె, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆదివారం ఉదయం 11గంటలకు శేషాద్రిస్వామి ఆలయంవద్ద దళితసంఘాల సమావేశం నిర్వహించనున్నట్లు సంఘం నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటుచేసే విషయమై పలువురి అభిప్రాయాలు తెలుసుకుంటామన్నారు. దళితసంఘాల సభ్యులు, మేధావులు, అంబేడ్కర్ అభిమానులు సమావేశానికి హాజరుకావాలని కోరారు.

నేడు ఉచిత కంటి వైద్యశిబిరం

బైరెడ్డిపల్లె, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉదయం మానసక్లినిక్, పున్నమిబేకరి సహకారంతో చెన్నై శంకర్ నేత్రాలయ ఆస్పత్రి వైద్యుల ఆధ్వర్యంలో ఉచిత కంటివైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు డాక్టర్ మురళీకృష్ణ, శ్రీనివాసులు, చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. వైద్యనిపుణులు కంటిపరీక్షలు జరిపి అవసరమైన వారిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేస్తారన్నారు. కంటిసమస్యలతో బాధపడుతున్నవారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నల్లగుండ్రాయస్వామి ఆలయంలో విశేషపూజలు

బైరెడ్డిపల్లె, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కడపనత్తం లోని నల్లగుండ్రాయస్వామి ఆలయంలో శనివారం విశేషపూజలు నిర్వహించారు. అర్చకులు స్వామివారికి అభిషేకం చేశారు. పలువురు భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు. మురారిపల్లె గ్రామంలోని ఓబులేశ్వరస్వామి ఆలయంలో పూజలు జరిగాయి.

వరసిద్ధుడి సేవలో సుహాస్

ఐరాల(కాణిపాకం), డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధుడిని సినీ హీరో సుహాస్ శనివారం సాయంత్రం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మురుగునీటితో అవస్థలు



రొంపిచెర్ల, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి) పెద్దమల్లెల పంచాయతీ నడింపల్లెలో చాకలివీధి వద్ద రోడ్డు మార్గం డ్రైనేజ్ నీటి నిల్వలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. బోడుమల్లువారిపల్లె, పాతపేట గ్రామాలకు వాహనదారులు, పాదచారులు వెళ్లలేకపోతున్నారు. రోడ్డు పక్కన మురుగునీటి కాలువ మట్టితో నిండిపోయింది. దీంతో కాలువ నీరు రోడ్డు పైకి వస్తుందని గ్రామస్థులు తెలిపారు. ఈ నీటి వలన దోమలు వృద్ధి చెందుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నక్కబండ కాలనీలో అధ్వాన పారిశుధ్యం



నక్కబండ వీధి దుస్థితి ఇది

పుంగనూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక నక్కబండ కాలనీలో పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. మురుగు, చెత్త చెదారం వల్ల అవస్థలు పడుతున్నారు. గతంలో హౌసింగ్ కాలనీలో కొన్ని వీధుల్లో మురుగునీరు వెళ్లడానికి కాల్వలు నిర్మించినా నీరు వెళ్లడానికి రోడ్డు మధ్యలో కల్వర్టులు ఏర్పాటు చేయలేదు. దీంతో మురుగునీరు రోడ్లపైన,ఇళ్లమధ్య పారుతోంది. ఉర్దూపాఠశాల వీధి మురుగునీరంతా స్కూల్ వద్ద చేరుతోంది. ఎన్నిసార్లు మున్సిపల్ కమిషనర్, అధికారులకు చెప్పినా పారిశుధ్య సమస్యలు తీరడంలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ పోస్టు రెండు నెలలుగా ఖాళీగా ఉంది. అధికారులు జోక్యం చేసుకుని మురుగు సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.



రోడ్డుపై పేరుకుపోయిన చెత్త

ప్రభుత్వ బడుల్లో మెరుగైన విద్యాబోధన: భానుప్రకాష్


సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

నగరి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యాబోధన చేస్తున్నట్లు ఎమ్మెల్యే భానుప్రకాష్ తెలిపారు. నగరి మున్సిపల్ పరిధిలోని ఏకాంబరకుప్పం ఉన్నత పాఠశాలలో హెచ్ఎం నమశ్శివాయం అధ్యక్షతన జరిగిన పేరెంట్, టీచర్స్ మీటింగ్(పీటీఎం)లో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కూటమి ప్రభుత్వం విద్యకు ప్రథమస్థానం ఇస్తుందని చెప్పారు. నగరి మండలం, పట్టణ పరిధిలో 78 ప్రాథమిక, 12 ఉన్నత, 12ప్రాథమికోన్నత పాఠశాలల్లో పీటీఎంలు నిర్వహించినట్లు ఎంఈవో శ్రీదేవి తెలిపారు. ఆర్డీవో భవానిశంకరి, తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీవో సతీష్, తెలుగు మహిళ అధికార ప్రతినిధి మీర, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల భాగస్వామ్యం అవసరం : మురళీ మోహన్

బంగారుపాళ్యం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు తల్లిదండ్రుల భాగస్వామ్యం అవసరమని ఎమ్మెల్యే మురళీ మోహన్ అన్నారు. శనివారం బంగారుపాళ్యం హైస్కూల్‌లో జరిగిన మెగా పేరెంట్, టీచర్స్ మీటింగ్‌కు కలెక్టర్ సుమిత్ కుమార్‌తోకలిసి హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వం పాఠశాలల్లో అన్ని వసతులు ఉన్నాయని చెప్పారు. సమావేశానంతరం తల్లిదండ్రులు, విద్యార్థులతో కలిసి ఎమ్మెల్యే, కలెక్టర్ సహపంక్తి భోజనం చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు ఎన్పీ జయప్రకాష్, నాయకులు కోదండయాదవ్, జనార్దన్ గౌడ్, ఎన్పీ ధరణి, కోకా ప్రకాష్ నాయుడు, జీఆర్ కన్‌స్ట్రక్షన్ అధినేత ఈశ్వర్ నాయుడు, సర్పంచ్ ఉమాదేవి, తహసీల్దార్ బాబూరాజేంద్రప్రసాద్, ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీధర్, ఎంఈవోలు నాగేశ్వర్ రావు, రమేష్‌బాబు పాల్గొన్నారు.

పూతలపట్టు: మండలంలోని పి.కొత్తకోట ఉన్నత పాఠశాల ఆవరణంలో జరిగిన సమావేశంలోనూ కలెక్టర్‌తో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. టీడీపీ మండల కన్వీనర్ దొరబాబు చౌదరి, జిల్లా అధికార ప్రతినిధి గంగారపు గోపి, నాయకులు బాబురావు, మునస్వామి, చింటు, నేతాజి నాయుడు, ఎంఈవో లోకనాథ రెడ్డి, సర్పంచ్ పద్మజరాణి, తహసీల్దార్ గుర్రప్ప, ఎంపీడీవో నాగరాజు, తదితరులు పాల్గొన్నారు. ● ముత్తిరేవుల ఉన్నత పాఠశాల ఆవరణంలో జరిగిన సమావేశంలో విద్యార్థుల తల్లిదండ్రులకు బహుమతులను టీడీపీ యువనేత, శ్రీ అభయసాయి ట్రస్టు వ్యవస్థాపకుడు ఎల్బీఐ లోకేష్ రెడ్డి ప్రదానం చేశారు.

ప్రతిభతోనే విద్యార్థులకు గుర్తింపు : థామస్


సమావేశంలో ప్రసంగిస్తున్న ప్రభుత్వ విప్ థామస్

శ్రీరంగరాజపురం డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రతిభతోనే విద్యార్థులకు గుర్తింపు వస్తుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే డాక్టర్ థామస్ అన్నారు. శనివారం ఎస్ఆర్‌పురం, 49.కొత్తపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో నిర్వహించిన మెగా పేరెంట్, టీచర్స్ మీటింగ్‌కు, టీడీపీ నిర్వహించిన సన్మాన సభకు హాజరయ్యారు. గత ప్రభుత్వం ఐదేళ్లలో చేయలేని అభివృద్ధిని తమ ప్రభుత్వం ఐదు నెలల్లో చేసిందని తెలిపారు. డీపీవో సుధాకర్‌రావు, ఇరిగేషన్ ఈఈ వెంకటేష్ ప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ విజయ్‌కుమార్, ఎస్ఎస్ పీవో వెంకటరమణారెడ్డి, ఎంఈవోలు అరుణాచలంరెడ్డి, సబర్మతి, నేతలు జయశంకర్ నాయుడు, గుండయ్య, లోకేష్, కిషన్‌చంద్, రాజశేఖర్ నాయుడు, రుద్రప్పనాయుడు, మునివర్ధ నాయుడు,కుమార్,వెంకటేశులు, బాబునాయుడు, శ్రీధర్‌యాదవ్, సూరిరెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

పి.కొత్తకోట పశువుల ఆస్పత్రికి నిధులు మంజూరు చేస్తా: కలెక్టర్


రోడ్డు సమస్యను కలెక్టర్‌కు తెలియజేస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

పూతలపట్టు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పి.కొత్తకోట పశువుల ఆస్పత్రికి నిధులు మంజూరు చేస్తానని కలెక్టర్ సుమిత్‌కుమార్ హామీ ఇచ్చారు. శనివారం పీటీఎం ముగిశాక ఎమ్మెల్యే మురళీమోహన్ సూచనతో పశువుల ఆస్పత్రి వద్దకెళ్లి భవనాన్ని పరిశీలించారు. వర్షం కురిస్తే భవనం పూర్తిగా ఉరుస్తుందని అధికారులు చెప్పగా, రూ.5 లక్షలు మంజూరు చేస్తానని కలెక్టర్ చెబుతూ.. సంబంధిత అధికారులను అక్కడికక్కడే పిలిపించి, నివేదికలు పంపాలని ఆదేశాలు జారీచేశారు. అక్కడినుంచి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వరకు ఎమ్మెల్యే మురళీమోహన్‌తో పాటు నడిచి వెళ్లి వైద్యులతో మాట్లాడారు. రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని.. ఆస్పత్రి అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం చిత్తూరు-తిరుపతి సిక్స్ లేన్ వద్ద లింకురోడ్డు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని ఎమ్మెల్యే చెప్పారు. ముఖ్యంగా వేము ఇంజనీరింగ్ కళాశాల వద్ద ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. అందువల్ల కొత్తకోట, వేము కళాశాల వద్ద ప్రజలు, విద్యార్థుల సౌకర్యార్థం లింకురోడ్డు ఏర్పాటుచేయాలని కోరగా, పరిష్కరిస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు.

భక్తులకు ప్రేమతో సేవ చేయండి

వరసిద్ధుడి ఆలయ ఈవో పెంచల కిషోర్


అన్నం తయారీని పరిశీలిస్తున్న పెంచలకిషోర్

ఐరాల(కాణిపాకం), డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): భక్తులకు ప్రేమతో సేవ చేయాలని అధికారులు, సిబ్బందికి కాణిపాక వరసిద్ధుడి ఆలయ ఈవో పెంచల కిషోర్ సూచించారు. శనివారం ఆలయ అన్నదాన కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడి సిబ్బందితో మాట్లాడారు. అన్నదాన కేంద్రానికి రోజుకు ఎంత మంది భక్తులు వస్తారని అడిగి తెలుసుకున్నారు. అధికారులు అందిస్తున్న దిట్టం సరిపోతోందా లేదా అని ఆరా తీశారు. అన్నదాన కేంద్రంపై తనకు ఎలాంటి ఫిర్యాదు అందకుండా.. సౌకర్యాలను మెరుగుపరచాలని అధికారులను ఆదేశించారు. అన్నప్రసాదాన్ని మరింత రుచిగా తయారుచేయాలని సిబ్బందికి చెప్పారు. భక్తులతో సిబ్బంది దురుసుగా ప్రవర్తించవద్దన్నారు. అనంతర భక్తులతో కలసి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఏఈవో రవీంద్రబాబు, అన్నదాన కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

మామిడి ఉత్పత్తులు విరివిగా వాడేలా చర్యలు తీసుకోవాలి

చిత్తూరు సెంట్రల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మామిడి ఉత్పత్తులను ప్రజలు, వ్యవస్థలు, సంస్థలు విరివిగా వాడేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్ సభ్యులు విజ్ఞప్తి చేశారు. మామిడి సాగు, సస్యరక్షణ చర్యలు, ఖర్చులు, ఉత్పత్తులు, వినియోగం, గుజ్జు పరిశ్రమల ఉనికి, రైతులకు నగదు చెల్లింపులు తదితర అంశాలపై శనివారం స్థానిక మ్యాంగో భవన్‌లో ఉద్యాన, సంబంధిత శాఖ అధికారులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఉద్యాన శాఖాధికారి మధుసూదన్ రెడ్డి, మార్కెటింగ్ శాఖ ఏడీ పరమేశ్వర్, ఆత్మ పీడీ సావిత్రి, సంఘం సౌత్‌జోన్ ఛైర్మన్ కట్టమంచి బాబి, గుజ్జు పరిశ్రమల యజమాన్యాలు తలపలపల్లి బాబురెడ్డి, బాలాజి, చంద్రమోహన్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్ సభ్యులు

'నాడు-నేడు' బిల్లులివ్వలేదని ఫిర్యాదు


డీఈవోకు ఫిర్యాదు చేస్తున్న రాజ్‌బాద్

విజయపురం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): విజయపురం ఉన్నత పాఠశాలలో శనివారం జరిగిన పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌కు డీఈవో వరలక్ష్మి హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాలలో గత ఏడాది 'నాడు-నేడు'లో చేసిన పనులకు బిల్లులు రాలేదని మాజీ ఎస్ఎంసీ ఛైర్మన్ భర్త రాజ్‌బాద్ డీఈవోకు ఫిర్యాదు చేశారు. బిల్లులు రాక అప్పుల పాలయ్యాయని తెలియజేయగా, విచారించి చర్యలు తీసుకుంటామని డీఈవో హామీ ఇచ్చారు.

నేడు గ్రంథావిష్కరణలు

చిత్తూరు కల్చరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): విజయం విద్యాసంస్థలో హరివిల్లు లలితా కళావేదిక ఆధ్వర్యంలో ఆదివారం గద్వాల సోమన్న రచించిన తొలకరి జల్లు, క్రిష్ణదాస్ రచించిన కీర్తనలు తత్వాల గ్రంథావిష్కరణలు జరగనున్నాయి. నగరంలోని సాహితీవేత్తలు, కళాకారులు పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

నగరాభివృద్ధికి కృషి చేద్దాం: మేయర్



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే జగన్మోహన్, కార్పొరేటర్లు - మేయర్ అముదతో కార్పొరేటర్ ఇందు వాగ్వాదం

చిత్తూరు అర్బన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): అందరం కలిసి పార్టీలకు అతీతంగా నగరాభివృద్ధికి కృషి చేద్దామని నగర మేయర్ అముద పిలుపునిచ్చారు. శనివారం నగరపాలక కౌన్సిల్ హాలులో మేయర్ అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్లు ఇందు, ఆలీ, సుష్మ మాట్లాడుతూ.. ఎంఎస్ఆర్ కాంప్లెక్స్ హాలులో ఉన్న అద్దె గదిని కోర్టు పరిధిలో ఉన్న ప్రాపర్టీని షూరిటీగా చూపించిన వారికి ఎలా కేటాయిస్తారని ప్రశ్నించారు. అలాగే ఎనిమిదేళ్లగా అద్దెకు తీసుకున్న ఒకరికే ఎందుకిస్తారని, ఇతరులకు అవకాశం కల్పించాలని కోరారు. ఇదే అంశాన్ని చాలాసేపు మాట్లాడుతున్న కార్పొరేటర్ ఇందును కూర్చోవాలని మేయర్ సూచించారు. ఒక సమయంలో ఇందును బయటికి పంపాలని మేయర్ ఆదేశించగా.. తానెందుకు పోవాలని ఆమె ప్రశ్నించడంతో స్వల్ప వాగ్వాదం జరిగింది. ఎక్స్ అఫిషియో హోదాలో హాజరైన ఎమ్మెల్యే జగన్మోహన్ కల్పించుకుని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని చెప్పారు. నీవానదికి రిటెయినింగ్ వాల్ నిర్మాణం, యూనివర్సిటీ మంజూరు, హైరోడ్డు విస్తరణకు నిధుల మంజూరు చేయాలని సీఎం చంద్రబాబును కోరగా సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, కమిషనర్ నరసింహ ప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.

ఆమోదించిన అంశాలిలా..

ఖాళీగా ఉన్న నగరపాలక వాణిజ్య దుకాణాల వేలం పాటలో పాల్గొన్న హెచ్చుపాటదారులకు దుకాణాలు కేటాయించడం. ● మంగసముద్రంలోని ప్రభుత్వ స్థలాన్ని కేంద్రీయ విద్యాలయ ఏర్పాటు కోసం రెవెన్యూశాఖకు బదలాయించడం. ● ప్రధాన కూరగాయల మార్కెట్, జంతువధశాల, ఎన్టీఆర్ బస్టాండ్ గుత్తను కాంట్రాక్టర్ చెల్లించకపోవడంతో రద్దు చేసి.. కొత్తగా వేలం పాట నిర్వహించాలని నిర్ణయం.

విద్యార్థులు క్రమశిక్షణతో ఎదగాలి: మేయర్


సమావేశంలో ప్రసంగిస్తున్న మేయర్ అముద

చిత్తూరు అర్బన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో ఎదగాలని, వారిని మంచి వైపు నడిపించే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని మేయర్ అముద అన్నారు. శనివారం గాండ్లపల్లె ఉన్నత పాఠశాలలో జరిగిన పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌కు కమిషనర్ నరసింహప్రసాద్‌తో కలిసి హాజరయ్యారు. పాఠశాలలో కల్పించాల్సిన సౌకర్యాలపై విద్యార్థుల తల్లిదండ్రులతో చర్చించారు. కార్పొరేటర్ భాగ్యలక్ష్మి, పేరెంట్స్ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం


బాధితులకు చెక్ ఇస్తున్న ఏఎస్పీ రాజశేఖర్‌రాజు

చిత్తూరు అర్బన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పెనుమూరు పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ సెప్టెంబరు నెలలో అనారోగ్యంతో మృతి చెందిన ఏఎస్ఐ సూరిబాబు సతీమణి సుజాతకు ఏఎస్పీ రాజశేఖర్‌రావు ఆర్థికసాయం చేశారు. అలాగే వెదురుకుప్పం పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మరణించిన హెడ్‌కానిస్టేబుల్ భార్య హేమలతకు కూడా ఆర్థికసాయం చేశారు. ఒక్కొక్కరికి కార్పస్ ఫండ్ నుంచి రూ.లక్ష చొప్పున రూ.2లక్షలకు సంబంధించిన చెక్కులను అందించారు. బీసెక్షన్ సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం, క్లర్క్ పార్థసారథి నాయుడు పాల్గొన్నారు.

స్మార్ట్ లాక్‌ను సద్వినియోగం చేసుకోండి

విజయపురం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ లాక్‌ను అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఐ బలరాం తెలిపారు. శనివారం విజయపురంలో ఆయన మాట్లాడుతూ.. ఇంటికి స్మార్ట్ లాక్ ఏర్పాటు చేసుకుంటే దుండగుల నుంచి రక్షణ పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రమేష్‌రాజు, ప్రధాన కార్యదర్శి బాబుయాదవ్, నాయకులు చిన్నబ్బరాజు, సుబ్రహ్మణ్యంరాజు, హెడ్‌కానిస్టేబుల్ చెంగయ్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలి: థామస్

శ్రీరంగరాజపురం డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఎమ్మెల్యే థామస్ అన్నారు. శనివారం పాతపాళ్యం దళితవాడలో ధ్వంసం చేసిన విగ్రహాన్ని పరిశీలించారు. విగ్రహాన్ని ధ్వంసం చేసినవారు ఎవరైనా కఠిన చర్యలు తీసుకోవాలని కార్వేటినగరం సీఐ హనుమంతప్ప, ఎస్ఐ సుమన్‌ను ఆదేశించారు. టీడీపీ మండల అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు, నాయకులు దాము, భాస్కర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మామిడి సాగుపై రైతులకు అవగాహన


రైతులతో మాట్లాడుతున్న మధుసూదన్ రెడ్డి

బంగారుపాళ్యం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సరైన సస్యరక్షణ పాటిస్తే మామిడిలో అధిక దిగుబడి వస్తుందని జిల్లా ఉద్యాన అధికారి మధుసూదన్‌రెడ్డి తెలిపారు. స్థానిక మార్కెట్ యార్డులో మామిడి సాగుపై రైతులకు శనివారం నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఏపీఎంఐపీ పీడీ బాలసుబ్రహ్మణ్యం, శాస్త్రవేత్త రంజిత్ కమార్, ఉద్యాన అధికారి సాగరిక, రైతు సేవా కేంద్రం సిబ్బంది, మామిడి రైతులు కోదండయాదవ్, రాజేంద్రనాయుడు పాల్గొన్నారు.

స్టోర్స్‌ను పరిశీలించిన ఎస్ఈలు


వివరాలు తెలుసుకుంటున్న ఎస్ఈలు ఇస్మాయిల్ అహ్మద్, సుధాకర్ నాయుడు

చిత్తూరు రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్టోర్స్‌ను విద్యుత్ శాఖ చిత్తూరు, తిరుపతి ఎస్ఈలు ఇస్మాయిల్ అహ్మద్, సుధాకర్ నాయుడులు కలిసి శనివారం పరిశీలించారు. వ్యవసాయ సర్వీసులు త్వరగా ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ట్రాన్స్‌ఫార్మర్లు, కేబుళ్ల కొరతలేకుండా చూసుకోవాలన్నారు.

వ్యసనాలకు బానిసలు కావొద్దు

● విద్యార్థులకు ఎమ్మెల్యే, చుడా ఛైర్‌పర్సన్ సూచన


సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే జగన్మోహన్, వేదికపై చుడా ఛైర్‌పర్సన్ హేమలత తదితరులు

గుడిపాల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగాలని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, చుడా ఛైర్‌పర్సన్ కటారి హేమలత పిలుపునిచ్చారు. కమ్మతిమ్మాపల్లె జడ్పీ హైస్కూల్‌లో జరిగిన మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశానికి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ.. చెడు అలవాట్లకు బానిసలు కావద్దని సూచించారు. తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీడీవో శివరాజ్, మాజీ జడ్పీటీసీ బాలాజీ నాయుడు, ఎంపీటీసీ గోళ్ల హరిప్రసాద్ చౌదరి, హేమాద్రి నాయుడు, ప్రధానోపాధ్యాయులు విజయలక్ష్మి, భానుప్రసాద్ రావు, విద్యాకమిటీ ఛైర్మన్ టి.ఆర్. ఢిల్లీబాయి, సర్పంచ్ రజిని, టీడీపీ నాయకులు రఘునాథ నాయుడు, హరి, మురారి సుధ, విక్టోరియా, బలరామ్, అనిల్‌కుమార్, మురళీ నాయుడు, పళని తదితరులు పాల్గొన్నారు. కాగా, వర్షం వస్తే నీరంతా ఇళ్లమీదకు వస్తున్నాయని ఎమ్మెల్యేకు రెట్టగుంట గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. సమస్యను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

రాష్ట్రస్థాయిలో పతకాలు సాధించాలి


టోర్నీ ప్రారంభోత్సవంలో చెన్నకేశవులు

చిత్తూరు క్రీడలు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయిలో పతకాలు సాధించి.. జిల్లాకు మంచి పేరు తేవాలని చిత్తూరు ఎమ్మెల్యే తండ్రి చెన్నకేశవులు నాయుడు అన్నారు. రెవెన్యూ భవన్‌లో ఏపీ 3వ ర్యాంకింగ్ క్యారమ్ టోర్నమెంట్‌ను శనివారం నిర్వహించారు. క్యారమ్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శివకుమార్ మాట్లాడుతూ.. ఈ పోటీలకు ఉమ్మడి జిల్లాల నుంచి 150 మంది క్రీడాకారులు పాల్గొన్నారని చెప్పారు. ఆరు స్థానాల్లో విజేతలతో రాష్ట్ర జట్టును ప్రకటిస్తామన్నారు. డీఎస్‌డీవో బాలాజి, అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పాండురంగం, రిఫ్రీ సాజిదా, తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు యువత దూరంగా ఉండాలి

బంగారుపాళ్యం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్‌కు యువత దూరంగా ఉండాలని ఎమ్మెల్యే మురళీ మోహన్ అన్నారు. శనివారం బంగారుపాళ్యం హైస్కూల్‌లో పోలీసు శాఖ ఏర్పాటు చేసిన పోస్టర్లను కలెక్టర్ సుమిత్ కుమార్‌తో కలిసి ఆవిష్కరించారు. టీడీపీ మండలాధ్యక్షుడు ఎన్పీ జయప్రకాష్, నాయకులు రాధాకృష్ణమ నాయుడు, హేమచంద్రనాయుడు, తహసీల్దార్ బాబూరాజేంద్రప్రసాద్, ఎంఈవో నాగేశ్వర్‌రావు, సీఐ కత్తిశ్రీనివాసులు పాల్గొన్నారు.

వరసిద్ధుడి సేవలో సుహాస్



ఐరాల(కాణిపాకం), డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధుడిని సినీ హీరో సుహాస్ శనివారం సాయంత్రం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు.

భగవద్గీత పోటీలు


విజేతలతో శైలజాకుమారి

చిత్తూరు కల్చరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణవీధి గీతాభవనంలో శనివారం టీటీడీ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో విద్యార్థులకు భగవద్గీత పోటీలు జరిగాయి. 70 మంది విద్యార్థులు పాల్గొన్నారు. సీనియర్ విభాగంలో పరిణిత, లక్ష్మీశ్వరి, జూనియర్ విభాగంలో ఎ.మోహనక్రిష్ణ, వి.భవిష్య గెలుపొందారు. విజేతలను విజయం విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ శైలజామూర్తి, డీపీపీ ప్రోగ్రాం అసిస్టెంట్ భద్రావతి, న్యాయనిర్ణేతలు రాము, మునస్వామి తదితరులు అభినందించారు.

భక్తి శ్రద్ధలతో షష్టి పూజలు

చిత్తూరు కల్చరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గిరింపేట చెంగల్రాయ కొండ వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో శనివారం షష్ఠి పూజలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

విద్యార్థులకు అభినందన

యాదమరి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆర్ట్‌ఫెస్ట్-2024లో భాగంగా కేన్డోర్ నేషనల్ పబ్లిక్ పాఠశాల వేదికగా శుక్రవారం జరిగిన పోటీల్లో తమ విద్యార్థులు ప్రతిభ చూపారని పీఈఎస్ పబ్లిక్ పాఠశాల ప్రిన్సిపాల్ వై.వి.కృష్ణ బాబు తెలిపారు. తమ విద్యార్థులు డి.మాన్సి (ఒకటో తరగతి), ఎం.డి.చందన (6వ తరగతి), ఎం.డి.తమన్నా (8వ తరగతి) బహుమతులు గెలుచుకున్నారన్నారు. వీరిని, శిక్షణ అందించిన ఆర్ట్ మాస్టర్ దినేష్‌ను శనివారం అభినందించారు.

ప్రొఫెసర్‌పై దాడి అమానుషం

నింద్ర, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ ప్రొఫెసర్‌పై దాడిని నింద్రలోని పాస్టర్లు, దళిత నాయకులు ఖండించారు. వారు మాట్లాడుతూ దాడి అమానుషమని, ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. వైసీపీ రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి శ్యామ్ లాల్, వైస్ ఎంపీపీ శుభారాము, ఎన్‌హెచ్ఆర్‌సీస్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ సంపత్ కుమార్, స్టేట్ కాంగ్రెస్ యూత్ సెక్రటరీ గిరి, మాదిగ మహాసేన జిల్లా కార్యదర్శి మురళి, నాయకులు గోవిందరాజులు, కాలయ్య, చార్లీ, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

ఉద్యోగి ఇంట్లో నగల చోరీ

పూతలపట్టు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఓ ఉద్యోగి ఇంట్లో బంగారు నగలు చోరీ అయ్యాయి. పి.కొత్తకోటలో నివాసముంటున్న విశ్వనాథ్ చెన్నైలో ఉద్యోగం చేస్తున్నాడు. నెల కిందట ఆయన కుటుంబీకులు చెన్నైకి వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో శుక్రవారం అర్ధరాత్రి ఇంటి వెనుకవైపు నుంచి దుండగులు లోపలకు చొరబడ్డారు. ఇంట్లో ఉన్న సుమారు 20 సవరాలకుపైగా బంగారు నగలను ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదుతో సీఐ కృష్ణమోహన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కార్తీక దీప కొప్పెరకు పూజలు



చిత్తూరు కల్చరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గుర్రప్ప నాయుడు వీధి అంకాల పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో శనివారం కార్తీక దీప కొప్పెరకు అర్చకుడు బి.కుమార్ ఆధ్వర్యంలో పూజలు చేశారు.

వితరణలు

విద్యార్థులకు భోజన ప్లేట్లు



బంగారుపాళ్యం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): శేషాపురం ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీలో చదువుతున్న 35మంది విద్యార్థులకు భోజన ప్లేట్లను గ్రామానికి చెందిన గుడివాడ చరణ్ శనివారం వితరణ చేశారు.

పాఠశాలకు కుర్చీలు



వెదురుకుప్పం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): దర్మాచెరువు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు 15 కుర్చీలను టీడీపీ నేతలు సుబ్రహ్మణ్యంరెడ్డి, యుగంధర్ వితరణ చేశారు. దాతలను ఉపాధ్యాయులు ఇ.భారతి, పి.చేతన అభినందించారు.

ఎల్ఈడీ టీవీ, వాటర్ బాటిళ్లు

చిత్తూరు రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కుర్బివేడు ప్రభుత్వ పాఠశాలకు ఎల్ఈడీ టీవీని, విద్యార్థులకు వాటర్ బాటిళ్లను జడ్పీటీసీ బాబునాయుడు శనివారం వితరణ చేశారు.అలాగే గ్రావిటా ఫ్యాక్టరీయాజమాన్యం రూ.70వేలతో పాఠశాల గది నిర్మించారని హెచ్ఎం సుబ్రహ్మణ్యం తెలిపారు. ఎంపీడీవో శ్రీనివాసులు, స్కూల్‌కమిటీ ఛైర్మన్ సెల్వ రాజ్, మాజీసర్పంచ్ నీలకంఠనాయుడు, గ్రావిటా ప్రతినిధులు ప్రభు,శశికళ,సందీప్ పాల్గొన్నారు.

బాధితులకు పరామర్శ

నగరి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నగరిలో మృతిచెందిన టీడీపీనేత వాసు నాయుడు తల్లి నాగరత్నమ్మ, ఎస్ఆర్ జయచంద్రన్ (పర్‌ఫెక్ట్ బైలర్) మృతదేహాలకు ఎమ్మెల్యే భానుప్రకాష్.. పూలమాలవేసి శనివారం నివాళిఅర్పించారు. బాధిత కుటుంబాలను పరామర్శించారు.

క్రమశిక్షణతో విద్యనభ్యసించండి

● విద్యార్థులకు అధికారులు, నాయకుల సూచన

ప్రభుత్వ పాఠశాలల్లో మెగా పేరెంట్, టీచర్స్ మీటింగ్ (పీటీఎం) శనివారం పండుగ వాతావరణంలో జరిగింది. క్రమశిక్షణతో విద్యనభ్యసించాలని విద్యార్థులకు అధికారులు, నాయకులు సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులకు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించారు.

చిత్తూరు రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పాలంతోపు ప్రభుత్వ పాఠశాలలో జరిగినసమావేశంలో టీడీపీ సీనియర్ నాయకుడు మోహన్‌రాజ్, హెచ్ఎం శోభారాణి, పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఐరాల: ప్రాథమిక పాఠశాలలో జరిగిన సమావేశంలో హెచ్ఎం ప్రతాప్‌రెడ్డి, ఎంఈవో రుష్యేంద్రబాబు, టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

పాలసముద్రం: మండలంలోని వెంగలరాజుకుప్పం జడ్పీ హైస్కూల్‌లో జరిగిన సమావేశంలో తహసీల్దార్ అరుణకుమారి, ఎంపీడీవో కృష్ణమహేష్‌రెడ్డి, ఎంఈవో రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

తవణంపల్లె: జడ్పీ హైస్కూల్‌లో జరిగిన సమావేశానికి డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి హాజరయ్యారు. ఎంఈవోలు త్యాగరాజులురెడ్డి, హేమలత పాల్గొన్నారు.

విజయపురం: ఉన్నత పాఠశాలలో డీఈవో వరలక్ష్మి, తహసీల్దార్ కిరణ్ హాజరయ్యారు. జంబాడ, పన్నూరు ఉన్నత పాఠశాలల్లో ఎంపీడీవో రమణప్రకాష్, ఎస్ఐ బలరాం, ఎంఈవో శ్యామల తదితరులు పాల్గొన్నారు.

పెనుమూరు: జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో తహసీల్దారు శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు. మహిళా పోలీసు వరలక్ష్మి ప్రసంగం ఆకట్టుకుంది. టీడీపీ మండల అధ్యక్షుడు రుద్రయ్యనాయుడు, పరమేశ్వర్‌రెడ్డి, ఎంపీపీ హేమలత, ఎంపీడీవో నీలకంఠేశ్వర్‌రెడ్డి, ఎంఈవో భాస్కర్‌నాయుడు పాల్గొన్నారు.

యాదమరి: ఉన్నత పాఠశాల సమావేశంలో తహసీల్దార్ పార్థసారథి, ఎంఈవో రుక్మిణి, ఆర్ఐ ప్రసాద్, ప్రధానోపాధ్యాయులు గిరిరాజా, లలిత, భాస్కర్‌రావు, పూర్వవిద్యార్థులు వల్లేరు అమరనాథ నాయుడు, రవి మొదలి పాల్గొన్నారు.

వెదురుకుప్పం: జడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం శ్రీనివాసులు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. మిగతా పాఠశాలల్లోనూ సమావేశాలు జరిగాయి. కార్యక్రమాల్లో ఎంపీడీవో అమరనాథ్, ఎంఈవో దామోదరం, టీఎస్‌టీయూసీ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు పోటుగారి గంగయ్య, నాయకులు పాముల శేషాద్రికుమార్, బోడిరెడ్డి సుధాకర్‌రెడ్డి, బోడిరెడ్డి వెంకటరమణారెడ్డి, దామోదరరెడ్డి పాల్గొన్నారు. ● కార్వేటినగరం మండలంలోని డీఎంపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థిని మోక్ష ప్రదర్శన ఆకట్టుకుంది. ఎంఈవో విజయకుమార్, హెచ్ఎం కేశవులు పాల్గొన్నారు. ఆర్కేవీబీపేటలో జరిగిన సమావేశంలో మండల తెలుగు యువత ప్రధానకార్యదర్శి ఢిల్లీబాబురెడ్డి, ఎస్సీ సెల్ ప్రధానకార్యదర్శి చెంగల్రాయులు పాల్గొన్నారు.

గంగాధరనెల్లూరు: మండలంలోని వేపంజేరి హైస్కూల్లో డ్వామా పీడీ రవికుమార్, నెల్లేపల్లె హైస్కూల్లో ఎస్ఎస్ పీవో వెంకటరమణారెడ్డి, పిచ్చిరెడ్డిపల్లె పాఠశాలలో ఎంపీపీ అనిత, ఎ.వెంకటాపురం పాఠశాలలో జడ్పీటీసీ లక్ష్మిప్రియ, గంగాధర నెల్లూరు(సర్విరెడ్డిపల్లె బస్టాప్‌కు సమీపం) వద్ద గల బాలికల గురుకుల పాఠశాల్లో జిల్లా గురుకుల పాఠశాలల కోఆర్డినేటర్ పద్మజ, ప్రిన్సిపాల్ దమయంతి, పాలసముద్రం మాజీ ఎంపీపీ ఇందిరమ్మ, వెజ్జుపల్లె పాఠశాల్లో ఎంపీడీవో హరిప్రసాద్ రెడ్డి, గంగాధరనెల్లూరు హైస్కూల్లో ఎంఈవో ఆంజినేయులుశెట్టి, హెచ్ఎం హేమలత పాల్గొన్నారు.